ప్రభాత సూర్య
PRABHATA SURYA
తెలుగు దిన పత్రిక
www.suryaa.news
వేల రూ.5/ - పేజీలు : 8 సోమవారం 15 సెప్టెంబర్ 2025 సంపుటి: 01, సంచిక : 79
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## జోరుగా ఐటీ రిటర్న్‌ల ఫైలింగ్

ఐటీ రిటర్న్‌ల ఫైలింగ్ ప్రక్రియ జోరందుకుంది. 2025-26 అసెసమెంట్ ఇయర్ (ఏవై)కు సంబంధించి ఇప్పటి వరకు ఆరు కోట్లకు పైగా ఐటీ రిటర్న్‌లు దాఖలైనట్టు ఆదాయ పన్ను (ఐటీ) శాఖ శనివారం ప్రకటించింది. వ్యక్తులు, హిందూ అవిభక్త కుటుంబాలు (హెచ్‌యూఎఫ), ఆడిట్ అవసరం లేని సంస్థలు సోమవారం లోగా పెనాల్టీ లేకుండా తమ ఐటీ రిటర్న్‌లు ఫైల్ చేయవచ్చు. 'ఇప్పటి వరకు ఆరు కోట్లకుపైగా ఐటీ రిటర్న్‌లు ఫైల్ అయ్యాయి. ఫైల్ అయినా రిటర్న్‌లను ఇంకా లెక్కిస్తున్నాం. ఈ మైలురాయిని అందుకునేందుకు సహకరించిన పన్ను చెల్లింపుదారులు, వృత్తి నిపుణులకు కృతజ్ఞతలు' అని ఐటీ శాఖ సామాజిక మా?ధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేసింది. రిటర్న్‌ల ఫైలింగ్, పన్ను చెల్లింపులు, ఇతర విషయాల్లో పన్ను చెల్లింపుదారులకు అవసరమైన సాయం అందించేందుకు తమ 'హెల్ప్ డెస్క్' 24


విలేకరులు కావలెను
సీనియర్ జర్నలిస్టుల సారధ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.
96667 32777
ప్రభాత సూర్య
www.suryaa.news



## నేను శివభక్తుణ్ని.. ఆ విషాన్ని నేను హరించేస్తా

- 'నేను ఇలా మాట్లాడితే మోదీ మమ్మల్ని టార్గెట్ చేస్తున్నారని కాంగ్రెస్ విమర్శలు చేస్తుంది
- నన్ను ఎంత దూషించినా పట్టించుకోను. ఎందుకంటే నేను శివుని భక్తుడిని..
- దేశ ప్రజలపై దాడి చేస్తే మాత్రం మౌనంగా ఉండను. ప్రజలే నా దేవుళ్లు.
- నా బాధను వాళ్ల ముందు వ్యక్తం చేయకపోతే .. ఎవరి ముందు చేస్తాను.
- కాంగ్రెస్ తన రాజకీయాల కోసం భారత్‌పై వ్యతిరేక భావజాలం ఉన్న వ్యక్తులతో జట్టు కట్టింది
- ఆపరేషన్ సిందూర్ సమయంలో కూడా ఇది బయటపడింది
- పాకిస్థాన్‌లోని ఉగ్రవాదులను మన సైన్యం మట్టుబెట్టింది

6



## అస్సాంలో భూకంపం.. 5.8 తీవ్రతతో ప్రకంపనలు

- భూకంప తీవ్రతకు పలు ఇళ్లు స్వల్పంగా ఊగినట్టు సమాచారం.
- ఇప్పటివరకు ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని అస్సాం అధికారులు వెల్లడి
- మేఘాలయ, మణిపూర్, త్రిపుర రాష్ట్రాల ప్రజలు కూడా తమ ప్రాంతాల్లో ప్రకంపనలు

# కాంగ్రెస్ గెలుపుతోనే అభివృద్ధి



- పోలింగ్ కేంద్రాల వారీగా ప్రణాళికలు
- నియోజకవర్గ నేతలకు, మంత్రులకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం
- అభ్యర్థి ఎంపికను అధిష్ఠానం చూసుకుంటుందని స్పష్టీకరణ
- ప్రతి డివిజన్‌కు రాష్ట్ర ప్రభుత్వ కార్పొరేషన్ల ఛైర్మన్‌లను, నియోజకవర్గానికి ముగ్గురు మంత్రులు
- నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి
- ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల గురించి ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయాలి

సూర్య హైదరాబాద్

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని... కాంగ్రెస్ కచ్చితంగా గెలిచి తీరాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో మంత్రులు, నియోజకవర్గం పరిధిలోని కాంగ్రెస్ పార్టీ డివిజన్ ఇన్‌ఛార్జులు, ఇతర నేతలతో సీఎం సమావేశమై ప్రచార వ్యూహంపై చర్చించారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర రావు, వివేక్ వెంకటస్వామి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, వివిధ డివిజన్ల ఇన్‌ఛార్జులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ కార్పొరేషన్ల ఛైర్మన్లు పాల్గొన్నా రు. పార్టీ వర్గాలు తెలిపిన సమాచారం ప్రకారం... ప్రతి డివిజన్‌కు రాష్ట్ర ప్రభుత్వ కార్పొరేషన్ల ఛైర్మన్‌లను, నియోజకవర్గానికి ముగ్గురు మంత్రులు పొన్నం, తుమ్మల, వివేక్‌లను ఇన్‌ఛార్జులుగా నియమించామని సీఎం తెలిపారు. వీరంతా సమన్వయంతో... నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో పర్యటించిన ఇన్‌ఛార్జులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రచారంలో ఏమైనా లోపాలుంటే మార్పులు చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ - మిగతా2లో

## భారత సంస్కృతికి ప్రతిరూపం హిందీ

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్



సూర్య హైదరాబాద్

'హిందీ ఒక భాష మాత్రమే కాదు. కోట్లాది మంది భారతీయుల భావోద్వేగాలు, సంస్కృతికి ప్రతిరూపం' అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. హిందీ రాజ భాష కావడంతో ప్రభుత్వ విభాగాల్లో - మిగతా2లో

## బంద్‌పై ప్రతిష్టంభన!

- ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలతో అర్ధరాత్రి వరకు ప్రభుత్వం చర్చలు
- ఫీజు బకాయిలు చెల్లించకపోతే సోమవారం నుంచి కాలేజీలు బంద్ చేస్తామన్న యాజమాన్యాలు
- బకాయిలు ఏకకాలంలో చెల్లించలేమని, విడతల వారీగా చెల్లిస్తామన్న ప్రభుత్వం
- సమ్మె విరమించమని కోరాం.. వారు సానుకూలంగా స్పందించారన్న భట్టి



సూర్య హైదరాబాద్

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలతో రాష్ట్ర ప్రభుత్వం జరిపిన చర్చల్లో ఎలాంటి స్పష్టత రాలేదు. ప్రైవేటు విద్యాసంస్థలన్నింటినీ మూకుమ్మడిగా మూసివేయాలని నిర్ణయించుకొని యాజమాన్యాలు ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చిన నేపథ్యంలో సర్కారు చర్చలకు ఉపక్రమించింది. ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో ఉప ముఖ్యమంత్రి - మిగతా2లో

## మీడియా ముందుకు రావొద్దు!



- పార్టీలో అంతర్గత విభేదాలపై నేతలకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ హెచ్చరిక
- స్థానిక ఎన్నికల వేళ విభేదాలకు దూరంగా ఉండాలని పార్టీ నేతలకు హితవు
- పీసీసీ చీఫ్, సీఎంకు వరంగల్ విభేదాలపై కమిటీ నివేదిక
- కేటీఆర్ తాను తీసుకున్న గోతిలో తానే పడ్డాడన్న కమిటీ చైర్మన్ మల్లురవి

సూర్య హైదరాబాద్

స్థానిక సంస్థలకు ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాష్ట్రంలోని కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ పిలుపునిచ్చింది. విభేదాలకు దూరంగా ఉండాలని హితవు పలికింది. అంతర్గత విభేదాల పేరుతో ఎవరైనా మీడియా ముందుకొచ్చి మాట్లాడితే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. కమిటీ చైర్మన్, ఎంపీ మల్లురవి అధ్యక్షతన టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ ఆదివారం గాంధీభవన్‌లో సమావేశమైంది. కమిటీ సభ్యులు అనంతుల శ్యాంమోహన్, కమలాకర్‌రావు తదితరులు ఈ భేటీలో పాల్గొన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులపై కమిటీ చర్చించింది. వరంగల్ జిల్లాకు చెందిన మంత్రి సురేఖ, పార్టీ నేతలు, ఎమ్మెల్యేల మధ్య విభేదాలపై రూపొందించిన నివేదికను.. సీఎం రేవంత్‌తోపాటు, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్‌కు అందజేయాలని కమిటీ నిర్ణయించింది. ఈ అంశంపై నిర్ణయం తీసుకునే అధికారం వారికే ఇవ్వాలని తీర్మానించింది. సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణపై ఫిర్యాదు రావడంతో ఆయన - మిగతా2లో




## స్టార్టప్‌లకు సర్కారు బూస్టప్

- ఏడాదికి 200 పైగా అంకుర సంస్థలకు వివిధ రంగాల్లో శిక్షణ, సలహాలు
- ఆర్థిక సాయం కోసం రూ.50 కోట్ల నిధి
- టీ హబ్‌లో గూగుల్‌కు 2 అంతస్తుల్లో ఆఫీస్
- డిసెంబరు 9న ప్రారంభించనున్న సీఎం

## 3 వేల ఏళ్ల క్రితం ప్రపంచాన్ని నడిపించాం.. కానీ ఏ దేశాన్ని వశపరచుకోలేదు



- ఎవరి వాణిజ్యాన్ని దెబ్బతీయలేదు. మనం ఎవరినీ కన్వర్ట్ చేయలేదు
- ఎక్కడకు వెళ్లినా నాగరితక, జ్ఞానం పంచాం
- పవిత్ర గ్రంథాలు చదివి జీవితాన్ని మెరుగుపరుచుకున్నాం
- ప్రతి దేశానికి సొంత ఐడెంటిటీ ఉంటుంది.

6

## నా మేధస్సు.. విలువ నెలకు రూ.200 కోట్లు..

- నితిన్ గడ్కరీ ఆసక్తికర వ్యాఖ్యలు
- తన ఆలోచనలు రైతులకు ప్రయోజనం చేకూర్చేందుకు తప్ప.. జేబులు నింపుకొనేందుకు కాదు
- 'నేను డబ్బు కోసం ఇలా చేస్తున్నానని మీరు అనుకుంటున్నారా?

6



# స్టార్టప్‌లకు సర్కారు బూస్టప్

హైదరాబాద్




తెలంగాణలో అంకుర (స్టార్టప్) సంస్థలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేయనుంది. రాష్ట్రాన్ని అంకురాల కేంద్రంగా, మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తోంది. టెక్ దిగ్గజం గూగుల్‌తో కలిసి స్టార్టప్‌లకు ప్రత్యేక సాయాలను అందించనుంది. వీటిలో ప్రధానంగా ఆర్థిక సాయం, మార్గదర్శనం (మెంటార్‌షిప్), సాంకేతిక శిక్షణలు ఉంటాయి. ఇందుకోసం హైదరాబాద్‌లోని టీ హబ్ భవనంలో రెండు అంతస్తులను గూగుల్‌కు కేటాయించారు. అవసరమైన మౌలిక వసతులు, సౌకర్యాలను కూడా ప్రభుత్వమే కల్పిస్తోంది. అంకురాలకు ఆర్థిక సాయంతో పాటు పలు రకాల సేవలను అందించేందుకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న టెక్ దిగ్గజ కంపెనీలను గూగుల్ ద్వారా హైదరాబాద్‌కు తీసుకురానున్నారు. అలాగే గూగుల్, తెలంగాణ ప్రభుత్వంతో కలిసి ఉన్న నెట్‌వర్క్ సంస్థలు, ఇతర భాగస్వామ్య సంస్థల ద్వారా దాదాపు రూ.50 కోట్ల నిధులను సేకరించనున్నారు. ఆ నిధుల నుంచే స్టార్టప్‌లకు ఆర్థిక సాయం అందించనున్నారు. మరికొన్ని కంపెనీల నుంచి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎసఆర్) కింద కూడా నిధులు సేకరించేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. స్టార్టప్‌లకు ఊతమిచ్చేందుకు 'గూగుల్ ఫర్ స్టార్టప్స్ హబ్ ఎట్ టీ హబ్' పేరుతో రూపొందించిన ఈ కార్యక్రమాన్ని, టీ హబ్‌లో ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని డిసెంబరు 9న సీఎం రేవంత్ ప్రారంభించనున్నారు. ఆ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. టీ హబ్‌లో పనులు పూర్తి కావచ్చాయని చెబుతున్నారు.

**సిలికాన్‌వ్యాలీ, జపాన్ నుంచి నిపుణులు..**

తెలంగాణలో ప్రస్తుతం సాంకేతికత, విద్య, వైద్యం, వ్యవసాయం, రవాణా రంగాల్లో స్టార్టప్‌లు విస్తృతంగా వస్తున్నాయి. ఇవి ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందడంతో పాటు పెట్టుబడులు వస్తే యువతకు ఉద్యోగ అవకాశాలు మరింత పెరిగే అవకాశం ఉంటుంది. దశాబ్ద కాలంగా ఐటీ హబ్‌గా తెలంగాణ పేరు తెచ్చుకున్నప్పటికీ అంకురాలను అంతర్జాతీయ స్థాయిలో నిలిపేందుకు అవసరమైన ప్రోత్సాహకాలు లేవని నిపుణులు చెబుతున్నారు. స్టార్టప్‌లు బలోపేతమవ్వాలంటే ప్రోత్సాహకాలే కీలకమని అంటున్నారు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం గూగుల్‌తో కలిసి ప్రత్యేకంగా స్టార్టప్‌లకు సాయం అందించాలని నిర్ణయించింది. దీని ద్వారా ప్రారంభ దశలో పెట్టుబడి (మూలధనం, వాటాలు) కోసం ఇబ్బందులు పడే అంకురాలకు ఆర్థిక సాయం అందిస్తారు. గూగుల్, దానికి అనుసంధానంగా ఉన్న కొన్ని ప్రముఖ కంపెనీలు, నెట్‌వర్క్ సంస్థల్లో పనిచేసే నిపుణులతో నేరుగా అంకురాల ఉన్నతికి శిక్షణ, సలహాలు, సూచనలు ఇస్తారు. గూగుల్ టెక్నాలజీతో కూడుకొని ఉన్న వేదికలు, టూల్స్‌ను వినియోగించుకుని స్టార్టప్‌ల వ్యాపారాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు, విస్తరించేందుకు అవకాశం కల్పించనున్నారు. అంతేకాకుండా ఏడాదిలో 200కు పైగా స్టార్టప్‌లకు శిక్షణలు, 10కి పైగా అంతర్జాతీయ ప్రతినిధులతో టీ హబ్‌లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అత్యాధునిక టెక్నాలజీ వినియోగంపై ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేస్తారు. అలాగే స్టార్టప్‌లు త్వరితగతిన అభివృద్ధి చెందేందుకు ఏఐ/ఎంఎల్, యూఎక్స్, జీటీఎం డొమైన్లలో క్లాసుల కోసం అవసరమైన ఏర్పాట్లు గూగుల్ చేస్తుంది. సిలికాన్‌వ్యాలీ, జపాన్, ఆగ్నేసియాల నుంచి ప్రముఖ నిపుణులను హైదరాబాద్ తీసుకొచ్చి తరగతులు చెప్పించే ఏర్పాట్లూ చేస్తుంది.

**అంకురాలకు సాయంపై ప్రత్యేక క్యాలెండర్**

ప్రభుత్వం, గూగుల్ కలిసి స్టార్టప్‌లకు అందించబోయే సాయం, శిక్షణల కోసం ప్రత్యేకంగా ఒక ప్రోగ్రామింగ్ క్యాలెండర్‌ను రూపొందించారు. ఫౌండర్స్ అకాడమీ, గూగ్లర్ క్లినిక్, ఏఐ వ్యూహాత్మక... ఏఐ స్ట్రాటజీ వర్క్‌షాపులు, అంతర్జాతీయ పెట్టుబడిదారుల సమావేశాలు, సాంకేతికతలో మహిళల ప్రభావం, సామాజిక ప్రభావం, విద్యార్థుల హ్యాకథాన్‌లు.. ఇలా పలు కార్యక్రమాలు ఉంటా యి. ఏడాదికి30 కార్యక్రమాలను నిర్వహించేలా ప్రణాళిక రూపొందించారు. దీని ప్రకారం ఫౌండర్స్ అకాడమీ 6సెషన్లు, గూగ్లర్‌మాస్టర్ క్లాసులు 5, ఇన్నోవేషన్ డే, హ్యాకథాన్‌లు 10, విద్యార్థులు, మహిళలకు సంబం?ధించి 8 క్యాంపస్‌ల్లో ఈవెంట్లు, పెట్టుబడిదారులతో 5రౌండ్‌టేబుల్ సమావేశాలు ఉండనున్నాయి.

# బంద్‌పై ప్రతిష్టంభన!

-మొదటిపేజీ తరువాయి

భట్టి విక్రమార్క, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలతో ప్రజా భవన్‌లో సమావేశమయ్యారు. ఇరుపక్షాల మధ్య నాలుగు గంటలపాటు జరిగిన చర్చల్లో ఎలాంటి స్పష్టత రాలేదని తెలిసింది. ప్రభుత్వం నుంచి ఏళ్ల తరబడి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు రాకపోవడంతో కళాశాలలు నడపటం కష్టంగా మారిందని, జీతాలు కూడా చెల్లించలేని పరిస్థితుల్లో ఉన్నామని యాజమాన్యాలు చెప్పాయి. తమకు రావాల్సిన బకాయిలన్నింటినీ వెంటనే విడుదల చేయాలని కోరాయి. అయితే ప్రభుత్వం నుంచి ఈ విషయంలో స్పష్టమైన హామీ రాలేదని యాజమాన్యాలు చెప్పాయి. రాష్ట్ర ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో ఫీజు బకాయిలు ఏకకాలంలో చెల్లింపు సాధ్యం కాదని, విడతల వారీగా చెల్లిస్తామని ప్రభుత్వం చెప్పింది. కళాశాలలను మూసివేయాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరింది. విద్యాసంస్థల డిమాండ్లను ఇప్పటికిప్పుడు నెరవేర్చడం సాధ్యం కాదని, కళాశాలలు మూసివేయడం వల్ల ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతింటుందని, నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని చెప్పింది. ఫీజుల చెల్లింపు విషయంలో ప్రభుత్వం నుంచి స్పష్టమైన భరోసా రాకపోవడంతో కళాశాలల మూసివేత నిర్ణయంపై వెనక్కు తగ్గే విషయంలో యాజమాన్యాలు కూడా ప్రభుత్వానికి స్పష్టత ఇవ్వలేకపోయినట్టు తెలిసింది. సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు ఇరుపక్షాల మధ్య మళ్లీ చర్చలు జరగనున్నాయి.

**సమస్యలను అర్థం చేసుకున్నాం**

మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నత విద్యామండలి చైర్మన్, ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, ప్రైవేట్ కళాశాలల యజమాన్యాలు ఆదివారం అయినప్పటికీ అందరం కలిసి సుదీర్ఘంగా నాలుగు గంటల పాటు చర్చించాం. చర్చలు సానుకూలంగా సాగాయి. కళాశాలల సమస్యలను అర్థం చేసుకున్నాం. సోమవారం ప్రభుత్వపరంగా నిర్ణయం తీసుకుంటాం. అప్పటివరకు సమ్మెను విరమించమని కళాశాలల యజమానులను కోరాం. వారు సానుకూలంగా స్పందించారు.

**ఉదయం ఏం జరిగిందంటే..**

అంతకుముందు ఉదయం ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు సమావేశమై కార్యాచణపై చర్చించాయి. సోమవారం నుంచి బంద్‌కు పాటించాలని నిర్ణయించాయి. ఫీజులు చెల్లించే వరకూ ఎట్టి పరిస్థితుల్లో కాలేజీలు తెరవొద్దని నిర్ణయించాయి. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్స్‌ఆఫ్ తెలంగాణ హయ్యర్ ఇన్‌స్టిట్యూషన్స్ (ఫతి) ప్రతినిధులు మీడియాకు తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం ఏడాది నుంచి వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్నాయి.
గత ఏడాది పరీక్షలను బహిష్కరించాలని నిర్ణయించాయి కూడా. దీంతో ప్రభుత్వం స్పందించి వారితో చర్చలు జరిపింది. దశల వారీగా బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చింది. దీంతో అప్పుడు ఆందోళన నిర్ణయాన్ని యాజమాన్యాలు విరమించుకున్నాయి. తాజాగా శుక్రవారం యాజమాన్య ప్రతినిధులు ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డిని కలిసి నోటీసు ఇచ్చారు. సెప్టెంబర్ 30లోపు బకాయిలను విడుదల చేయకపోతే, ఆందోళనను ఉధృతం చేస్తామని ప్రకటించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం సర్కారు చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో విద్యాసంస్థలను మూకుమ్మడిగా మూసివేయాలని నిర్ణయించారు. బంద్ జరిగితే రాష్ట్రంలోని 1,500 పైచిలుకు ప్రైవేట్ ఇంజినీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ, బీఈడీ, ఫార్మసీ, నర్సింగ్ కాలేజీలకు తాళాలు పడనున్నాయి. దాదాపు 10 లక్షల విద్యార్థులకు బోధన దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుంది.


**ఓపిక నశించిందన్న ప్రతినిధులు**

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లిస్తుందని ప్రభుత్వంపై ఇన్నాళ్లు విశ్వాసం పెట్టుకున్నామని 'ఫతి' ప్రతినిధులు ఉదయం మీడియాకు చెప్పారు. ఇక ఓపిక నశించిందని, అందుకే ఆందోళన బాట పట్టామని తెలిపారు. టోకెన్లు జారీ చేసినప్పటికీ డబ్బులు ఇవ్వలేదన్నారు. దీంతో అన్ని కాలేజీల యాజమాన్యాలు ఉమ్మడి పోరుబాటకు సిద్ధమై ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్స్‌ఆఫ్ తెలంగాణ హయ్యర్ ఇన్‌స్టిట్యూషన్స్‌ను ఏర్పాటు చేసుకున్నాయి.
రూ.లక్ష కోట్ల డిపాజిట్లతో ప్రత్యేకంగా ట్రస్ట్ బ్యాంక్‌ను ఏర్పాటు చేయాలని ప్రైవేటు యాజామాన్యాలు సర్కారుకు ప్రతిపాదించాయి. ఈ లక్ష కోట్లలో సర్కారు వాటా పరిమితమేనని, సీఎస్సార్, కార్పస్ ఫండ్ వంటి ఇతర మార్గాల ద్వారానే ఈ నిధులను సేకరించవచ్చని సూచించాయి. లక్ష కోట్ల డిపాజిట్లపై వచ్చే ఏడు శాతం వడ్డీ (సుమారు రూ.3వేలకోట్లు)తో ఫీజు రీయింబర్స్ చేయొచ్చని ప్రతిపాతిదించాయి. దీనిని కూడా సర్కారు పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో అన్ని రకాల వృత్తి విద్యా కాలేజీల యాజమాన్యాలు గురువారం రాత్రి సమావేశమయ్యాయి. సెప్టెంబర్ 15 నుంచి కాలేజీల నిరవధిక బంద్ పాటించాలని నిర్ణయించాయి. 'ఫతి' బాటలోనే తెలంగాణ డిగ్రీ, పీజీ కాలేజీల యాజమాన్య సంఘం (టీపీడీపీఎంఏ) కూడా కాలేజీల బంద్‌కు పిలుపునిచ్చింది. తాము ఈ నెల 16 నుంచి కాలేజీలను మూసివేస్తామని అసోసియేషన్ చెప్పింది.

# జీవో 33తో మా పిల్లలకు అన్యాయం

పాల్వంచ

జీవో నెంబరు 33తో తమ పిల్లలకు తీవ్ర అన్యాయం జరిగిందని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. 2025–26 నీట్ కౌన్సెలింగ్‌లో తెలంగాణ ఫైనల్ మెరిట్ లిస్టులో తమ పిల్లల పేర్లను చేర్చి.. వారి ఉన్నత చదువులకు అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడారు. తమ పిల్లలు తెలంగాణ వాసులేనని.. పక్క రాష్ట్రం ఏపీలో ఇంటర్మీడియట్ చదువుకున్నంత మాత్రాన జీవో నెంబరు 33 ద్వారా లోకల్ అర్హత కోల్పోవడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు. పలువురు విద్యార్థులు మాట్లాడుతూ ప్రభుత్వం ఈ జీవో జారీ చేయడానికి ముందే తాము ఇంటర్మీడియట్ పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ జీవో తమ భవిష్యత్తుకు అడ్డంకిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు



## మీడియా ముందుకు రావొద్దు!

-మొదటిపేజీ తరువాయి

వివరణ కోరింది.
సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తూంకుంట నర్సారెడ్డి క్రమశిక్షణ కమిటీ ముందు హాజరై తనపై వచ్చిన ఫిర్యాదుల గురించి వివరణ ఇచ్చారు. అనంతరం నర్సారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ తనపై నమోదైన పోలీస్ కేసు గురించి కమిటీ వివరణ అడిగిందని చెప్పారు. తనపై ఫిర్యాదు చేసిన నాయకులు పార్టీకి సేవ చేసిన వారు కాదని, బీజేపీకి పనిచేసిన వారని చెప్పారు. అలాంటి వారు ఆరోపణలు చేస్తే కమిటీ తనను వివరణ ఎందుకు అడిగిందో అర్థం కావడం లేదన్నారు. గజ్వేల్‌తో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావుకు సంబంధం లేదన్నారు.

**రాజగోపాల్‌రెడ్డి అంశం మా దృష్టికి రాలేదు: చైర్మన్ మల్లురవి**

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గురించి తాము చర్చించలేదని మల్లురవి చెప్పారు. కమిటీ భేటీ అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎవరి ప్రయోజనాల కోసమో క్రమశిక్షణ కమిటీలో చర్చ జరగదన్నారు. రాజగోపాల్‌రెడ్డి అంశం తమ దృష్టికి రాలేదని, ఎవరైనా ఫిర్యాదు చేస్తే అది క్రమశిక్షణ కమిటీకి వస్తుందని చెప్పారు. కాంగ్రెస్ నుంచి బయటకెళ్లిన వారంతా మళ్లీ పార్టీ గూటికి రావాలని కోరారు. పార్టీలో అంతర్గత విభేదాల పేరుతో రచ్చకెక్కితే చర్యలు తప్పవని హెచ్చరించారు. మాజీ మంత్రి కేటీఆర్ తాను తవ్వుకున్న గోతిలో తానే పడ్డాడని ఎద్దేవా చేశారు. గత పదేళ్లలో ఆయన ఏం చేశారో ఒక్కసారి చూసుకుని తమను ప్రశ్నించాలన్నారు. పదేళ్లలో ఎంతో మందిని చేర్చుకున్న ఆయన కూడా రాజీనామాలు చేయించారా అని ప్రశ్నించారు. అసలు ఆ ఎమ్మెల్యేలు తాము పార్టీనే మారలేదని చెపుతుంటే కేటీఆర్‌కు వచ్చిన ఇబ్బందేంటో అర్థం కావడం లేదన్నారు.

## భారత సంస్కృతికి ప్రతిరూపం హిందీ

-మొదటిపేజీ తరువాయి

జసమన్వయం వచ్చిందన్నారు. విదేశాల్లో కూడా కోట్లాది మంది హిందీ మాట్లాడుతున్నారని, ఐక్యరాజ్య సమితి వంటి వేదికలపై ఈ భాషకు వచ్చిన అంగీకారం, భారతదేశ సాంస్కృతిక శక్తికి ప్రతీక అని వ్యాఖ్యానించారు. 'హిందీ దివ్‌స'ను పురస్కరించుకుని ఆదివారం అహ్మదాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమానికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌తో పాటు సంజయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'భాష అనేది కేవలం సంభాషణ సాధనం కాదు. అది మన సంస్కృతి, సంప్రదాయాల సంరక్షకురాలు. ఆత్మనిర్భర భారతావనికి అతి పెద్ద శక్తి దాని స్థానిక, మాతృభాషలే. మాతృ భాష మన హృదయానికి అత్యంత చేరువైనది. విదేశీ భాషలు మన జ్ఞానం, అవకాశాలను విస్తరిస్తాయి. ప్రతి భాషను సంరక్షించడం, గౌరవించడం మన కర్తవ్యం' అని అన్నారు

## కాంగ్రెస్ గెలుపుతోనే అభివృద్ధి

-మొదటిపేజీ తరువాయి

పథకాలు, అభివృద్ధి పనుల గురించి ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వారీగా ప్రచార ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలన్నారు. నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరిస్తుందన్న భరోసాను వారికి కల్పించాలని మంత్రులకు చెప్పారు. ఉప ఎన్నికలో కాంగ్రెస్ విజయంతోనే జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమవుతుందని సీఎం అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక విషయం అధిష్ఠానం చూసుకుంటుందని, ఈలోగా ప్రచారంపై అందరూ దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. 'పార్టీ విజయం కోసం పనిచేయాల్సిన గురుతర బాధ్యత మీపై ఉంది. మీ పనితీరు, క్షేత్రస్థాయి పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం తీసుకుంటాను. గెలుపే లక్ష్యంగా సమన్వయంతో పనిచేయాలి' అని రేవంత్‌రెడ్డి చెప్పారు.

**అంకెలు సహా ప్రచారం చేయాలి: మహేశ్‌కుమార్‌గౌడ్**

పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారం చేపట్టిన తరువాత ప్రజల కోసం పెద్దఎత్తున చేపట్టిన పనుల గురించి అంకెలు సహా ప్రచారం చేయాలని చెప్పారు. గ్రేటర్ హైదరాబాద్‌కు చెందిన ముఖ్య నేతలంతా నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేయాలని సూచించారు. ఈ ఎన్నికలో గెలుపుతో నగరంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవకాశం కలుగుతుందని ఆయన వివరించారు. ఉప ఎన్నికకు బాధ్యులుగా నియమితులైన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, వివేక్‌లు కూడా ప్రచారంలో అనుసరించాల్సిన వ్యూహాలపై సూచనలిచ్చారు.

## సర్కారు కరుణిస్తేనే జీతాల పెంపు

హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఆర్టీసీ) తన ఉద్యోగుల వేతన సవరణ బాధ్యతను ప్రభుత్వానికి వదిలేసింది. ప్రభుత్వం ఆర్థిక చేయూతనందిస్తేనే ఉద్యోగుల జీతాలు పెంచే అవకాశం ఉంటుందని తేల్చి చెప్పింది. 2017 నాటి వేతన సవరణను గతేడాది ఏప్రిల్‌లో అమలు చేసిన నేపథ్యంలో, ఆ తదుపరి 2021 వేతన సవరణపై సంస్థ దృష్టి సారించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతో 2025 వేతన సవరణ గడువు ప్రారంభమవుతున్నందున, 2021 వేతన సవరణ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుత ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తిరిగి పోలీసు శాఖకు బదిలీ అయ్యే అవకాశం ఉన్నందున, ఈలోపు దీన్ని కొలిక్కి తేవాలని ఆయన ప్రభుత్వానికి ప్రతిపాదించారు. అక్కడి నుంచి ఆమోదం లభిస్తే నాలుగేళ్ల జాప్యంతో ఆ వేతన సవరణను పూర్తి చేసినట్టవుతుంది.

**15 శాతం ఫిట్‌మెంట్ ఇస్తే నెలకు రూ.60 కోట్ల భారం**

వేతన సవరణ చేస్తే సంస్థపై పడే భారంపై అధికారులు లెక్కలు వేశారు. హీనపక్షంగా 10 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చినా నెలకు జీతాల భారం అదనంగా రూ.40 కోట్లు పెరుగుతుంది. అదే 15 శాతం ప్రకటిస్తే ఆ మొత్తం రూ.60 కోట్లకు చేరుకుంది. మహాలక్ష్మి పథకం వల్ల రోజువారీ ఆదాయం తగ్గటంతో సంస్థ సొంతంగా ఈ భారాన్ని మోయటం అసాధ్యం. ప్రస్తుతం టికెట్ రూపంలో ఆర్టీసీకి వస్తున్న ఆదాయం రోజుకు రూ.12 కోట్ల లోపే. రోజువారీ ఖర్చులకు కూడా ఆ నిధులు సరిపోవటం లేదు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణం అందుబాటులోకి వచ్చాక, మహిళా ప్రయాణికుల నుంచి ఆదాయం 90 శాతం తగ్గిపోయింది. వేతన సవరణ చేస్తే రోజుకు అదనంగా రూ.2 కోట్లు చొప్పున జీతాలకు అదనంగా చెల్లించాలి. దానిని సర్దుబాటు చేయటం ఇప్పుడున్న పరిస్థితుల్లో సంస్థకు అసాధ్యమని ఆర్టీసీ యాజమాన్యం ప్రభుత్వానికి తేల్చి చెప్పింది.

**రీయింబర్స్‌మెంట్‌ను రూ.350 కోట్లకు పెంచాలి..**

మహాలక్ష్మి పథకం కింద ప్రభుత్వం ఆర్టీసీకి నెలకు రూ.310 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తం కూడా ప్రతినెలా విడుదల కావటం లేదు. గత నెల రూ.190 కోట్లు మాత్రమే విడుదల కావటంతో ఉద్యోగులకు సకాలంలో ఆర్టీసీ జీతాలు చెల్లించలేకపోయింది. ఇప్పుడు ఆ మొత్తాన్ని కనీసం రూ.350 కోట్లకు పెంచితే దానికి సరిపడే ఫిట్‌మెంట్ మేరకు వేతన సవరణ చేస్తామని తాజాగా ప్రభుత్వానికి ఆర్టీసీ ప్రతిపాదించింది. 2017 విడత వేతన సవరణను అప్పట్లో సకాలంలో చేయలేదు. దీంతో కార్మికులు సమ్మె చేయగా, బీఆర్ఎస్ ప్రభుత్వం ఐదుగురు మంత్రులతో కమిటీ వేసింది. ఆ కమిటీ కార్మిక సంఘాల నేతలతో చర్చించి, ఆర్థిక పరిస్థితి బాగోలేనందున కొంత విరామం తర్వాత వేతన సవరణ చేస్తామని, అప్పటి వరకు మధ్యంతర భృతి ఇస్తామని తేల్చి చెప్పింది. ఆ మేరకు 16 శాతం మధ్యంతర భృతిని ఖరారు చేసింది. 2024 వరకు అదే కొనసాగింది. మళ్లీ కార్మిక సంఘాలు సమ్మెకు సిద్ధం కావటంతో, గత సంవత్సరం ప్రభుత్వం 21 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చేందుకు అంగీకరించింది. ఇప్పుడు అంతమేర ఫిట్‌మెంట్ ఇచ్చే పరిస్థితి దాదాపు లేదని ఆర్టీసీ పరోక్షంగా స్పష్టం చేసింది. 15 శాతం ఖరారు చేసినా పరిస్థితి చేయిదాటిపోతుందని తేల్చింది. ప్రభుత్వం ఎంతమేర ఆర్థిక సాయం చేస్తే అంతమేర వేతనాలను పెంచేందుకు సిద్ధమవుతోంది.

# నేను శివభక్తుణ్ని.. ఆ విషాన్ని నేను హరించేస్తా

దిస్పూర్

తనపై,తన తల్లి హీరాబెన్‌పై వ్యక్తిగత విమర్శలు చేస్తున్న కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నేను శివభక్తుణ్ని.. కాంగ్రెస్ విమర్శల విషాన్ని హరించేస్తా'అని స్పష్టం చేశారు. ఈశాన్య రాష్ట్రాల పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ అసోంలో దరంగ్ జిల్లాలో ఆదివారం వేలకోట్ల విలువైన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడారు. 'నేను ఇలా మాట్లాడితే మోదీ మమ్మల్ని టార్గెట్ చేస్తున్నారని కాంగ్రెస్ విమర్శలు చేస్తుంది. నన్ను ఎంత దూషించినా పట్టించుకోను. ఎందుకంటే నేను శివుని భక్తుడిని.. విమర్శల విషాన్ని హరించేస్తా.

గాయకుడు భూపెన్ హజారికాకు భారతరత్న ఇవ్వడం మంచి నిర్ణయమా కాదా? కానీ ఆయనకు భారతరత్న ఇచ్చి గౌరవించినందుకు కాంగ్రెస్ పార్టీ అవమానించింది' అని మోదీ అన్నారు. ఈ సందర్భంగా ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటని పేర్కొన్నారు. దీనికి ముందు దరంగ్ జిల్లాలోని మంగల్‌డోయ్‌లో రూ.6,300 కోట్ల విలువైన ఆరోగ్య, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. దరంగ్ మెడికల్ కాలేజీ, హాస్పిటల్ నిర్మాణంతో పాటు, నర్సింగ్ కాలేజీ, జీఎన్ఎమ్ పాఠశాలను ప్రారంభించారు.

**నా రిమోట్ కంట్రోల్ వాళ్లే**

కానీ దేశ ప్రజలపై దాడి చేస్తే మాత్రం మౌనంగా ఉండను. ప్రజలే నా దేవుళ్లు. నా బాధను వాళ్ల ముందు వ్యక్తం చేయకపోతే .. ఎవరి ముందు చేస్తాను. అందుకే వాళ్లే నా యజమానులు, నా దేవతలు, నా రిమోట్ కంట్రోల్. నాకు వేరే రిమోట్ కంట్రోల్ లేదు' అని స్పష్టం చేశారు.

**చర్చకు దారితీసిన మోదీ రిమోట్ కంట్రోల్ వ్యాఖ్యలు ?**

అయితే, అస్సాం సభలో ప్రధాని మోదీ



మరోసారి'రిమోట్ కంట్రోల్' వ్యాఖ్యలు చర్చకు దారి తీశాయి. గతంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌ను అప్పటి యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ రిమోట్ కంట్రోల్ చేశారని మోదీ ఆరోపించారు. అలాగే, ప్రస్తుత కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గాంధీ కుటుంబం రిమోట్ కంట్రోల్‌లో ఉన్నారని కూడా విమర్శించారు.

2019లో ప్రధాని మోదీ ప్రభుత్వం ప్రముఖ అస్సామీ సంగీత కళాకారుడు భూపెన్ హజారికాకు భారతరత్న అవార్డ్‌తో సత్కరించింది. ఆ అవార్డుపై కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే విమర్శలు గుప్పించారు. మోదీ గాయకులకు, నర్తకులకు అవార్డు ఇస్తున్నారు' అని ఎద్దేవా చేశారు. అప్పట్లో తాను చేసిన వ్యాఖ్యలపై దుమారం చెలరేగడంతో ఖర్గే క్షమాపణలు చెప్పారు. ఖర్గే.. భూపెన్ హాజారికాను ఉద్దేశిస్తూ చేసిన విమర్శలను రాష్ట్ర సీఎం హిమంత బిశ్వశర్మ తనతో ప్రస్తావించినట్లు మోదీ తాజాగా సభలో గుర్తు చేశారు.

**దేశ వ్యతిరేక శక్తులను కాంగ్రెస్ రక్షిస్తోంది..: మోదీ**

'1962లో చైనాతో యుద్ధం తర్వాత అప్పుడు ప్రధానిగా ఉన్న నెహ్రూ ఈశాన్య ప్రాంత ప్రజలకు చేసిన గాయాలు నేటికీ మానిపోలేదు. ప్రస్తుత తరం కాంగ్రెస్ ఆ గాయాలపై ఇప్పటికీ ఉప్పు చల్లుతుంది' అని మోదీ ఆరోపించారు. కాంగ్రెస్ తన రాజకీయాల కోసం భారత్‌పై వ్యతిరేక భావజాలం ఉన్న వ్యక్తులతో జట్టు కట్టిందని విమర్శించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో కూడా ఇది బయటపడిందన్నారు. పాకిస్థాన్‌లోని ఉగ్రవాదులను మన సైన్యం మట్టుబెట్టిందన్నారు. కానీ, హస్తం పార్టీ మాత్రం మన సైన్యానికి కాకుండా దాయాది దేశంలోని సైన్యానికి మద్దతిస్తోందన్నారు. పాక్ అబద్ధాలు కాంగ్రెస్ అజెండాలుగా మారుతున్నాయన్నారు. ప్రస్తుతం ఆక్రమణదారులకు, దేశ వ్యతిరేకులకు ఆ పార్టీ రక్షణ కవచంగా మారిందంటూ.. వారితో జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు సూచించారు.

**అవును.. ఖర్గే అనుచితంగా మాట్లాడారు**

అవును. భారత ప్రభుత్వం ఈ దేశపు ముద్దుబిడ్డ అస్సాం గర్వకారణం భూపేన్ హజారికాను భారతరత్నతో సత్కరించిన రోజున కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే అనుచిత వ్యాఖ్యలు చేశారు. మోదీ ఈ అవార్డును 'గాయకులు, నృత్యకారులకు'ఇచ్చారని అన్నారంటూ అస్సాం సభలో మోదీ గుర్తు చేస్తూ రాష్ట్రంలో కాంగ్రెస్ హయాంలో.. బీజేపీ హయాంలో జరిగిన అభివృద్ధి గురించి చర్చించారు. ఇటీవల రాహుల్ గాంధీ ఓటర్ అధికార్ యాత్రలో మోదీని, మోదీ తల్లిని కొందరు దూషించినట్లుగా ఓ వీడియోను విడుదల చేసింది. ఆ సమయంలో ఆ వీడియోపై ..మోదీ స్పందిస్తూ.. కాంగ్రెస్ తన తల్లి హీరాబెన్‌ను రాజకీయాల్లోకి లాగడం సరైందికాదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా బీహార్ కాంగ్రెస్ విభాగం సోషల్ మీడియాలో ఓ ఏఐ వీడియోను పోస్టు చేసింది. ఆ వీడియోను మోదీ, తల్లి హీరాబెన్‌ను ఉద్దేశించి ఉండటం తీవ్ర దుమారం రేగింది. కాంగ్రెస్ తనని వ్యక్తిగత హననం చేయడంపై ఇవాళ అస్సాంలో మోదీ స్పందించారు.

### భోపాల్ '90 డిగ్రీల' వంతెనకు పోటీగా

# నాగపూర్ 'బాల్కనీ ఫ్లైఓవర్'





నాగ్‌పూర్:మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో 90 డిగ్రీల మలుపుతో నిర్మించిన వింతైన ఫ్లైఓవర్ వార్తల్లో నిలిచింది. దీనిపై వెళ్లే వాహనదారులు తికమకపడటం ఖాయం అనిపించేలా దానిని నిర్మించారు. ఇప్పుడు మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లోనూ ఇలాంటి అద్భుతాన్నే నిర్మించారు. ఈ తాజా ఇంజినీరింగ్ పరిజ్ఞానం ఇప్పుడు అందరి దృష్టిని అలరిస్తోంది. నాగ్‌పూర్‌లో నిర్మాణంలో ఉన్న ఈ ఫ్లైఓవర్ అశోక్ చౌక్ సమీపంలోని ఒక ఇంటి బాల్కనీ భాగం గుండా వెళ్లడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. స్థానికులు దీనిని ఎనిమిదవ అద్భుతం అని అంటున్నారు. భారత జాతీయ రహదారుల అథారిటీ (ఎన్‌హెచ్‌ఏఐ), నాగ్‌పూర్ మున్సిపల్ కార్పొరేషన్‌లు ఒక ఇంటి బాల్కనీ గుండా ఈ నిర్మాణం చేపట్టేముందు ఎందుకు దీనిని గమనించేలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ బాల్కనీ ఫ్లైఓవర్ గురించి ఇంటి యజమాని ప్రవీణ్ పాత్రే, అతని కుమార్తె సృష్టితో పాటు సీనియర్ బీజేపీ ఎమ్మెల్యే మోహన్ మేట్‌లు మీడియాతో మాట్లాడారు.పాత్రే, అతని కుమార్తె తెలిపిన వివరాల ప్రకారం.. వారి కుటుంబం ఆరు తరాలుగా ఆ ఇంట్లో నివసిస్తోంది. ఈ ఆస్తి దాదాపు 150 సంవత్సరాల నాటిది. ఈ ఇంటిని 25 సంవత్సరాల క్రితం పునరుద్ధరించారు. కాగా ఫ్లైఓవర్ తమ బాల్కనీని ఆనుకంటూ వెళ్లడంపై తమకు ఎటువంటి అభ్యంతరం లేదని, భద్రతా ప్రమాదాల గురించి ఆందోళన చెందడం లేదని వారు అన్నారు. అయితే ఈ ఇంటి ప్లాన్‌కు ఆమోదం ఉందా? అని అడిగినప్పుడు వారు తప్పించుకునే సమాధానం ఇచ్చారు. 9.2 కిలోమీటర్ల మేర ఈ ఫ్లైఓవర్‌ను ఎన్‌హెచ్‌ఏఐ పర్యవేక్షణలో రూ. 998 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నారు. ఈ వివాదంపై అధికారులు మాట్లాడుతూ దీనిపై ఇప్పటికే మున్సిపల్ కార్పొరేషన్‌కు తెలియజేశామన్నారు. ఈ అనధికార నిర్మాణాన్ని కూల్చివేయడం నాగ్‌పూర్ మున్సిపల్ కార్పొరేషన్ బాధ్యత అని అన్నారు. కాగా సౌత్ నాగ్‌పూర్ ఎమ్మెల్యే మోహన్ మేట్ మాట్లాడుతూ ఈ ఫ్లైఓవర్ విషయంలో మున్సిపల్ కార్పొరేషన్ ఇప్పటివరకు ఎటువంటి చర్య తీసుకోకపోవడం ఆశ్చర్యపరిచిందన్నారు. దీనికి కారకులైనవారిని వెంటనే సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఫ్లైఓవర్ నిర్మాణం బాల్కనీకి చేరుకునే ముందుగానే సంబంధింత అధికారులు నోటీసు జారీ చేసి, నిర్మాణాన్ని తొలగించి ఉండాల్సిందని ఆయన అన్నారు.

# అమెరికాకు షాకిచ్చిన చైనా.. చర్చల వేళ రెండు దర్యాప్తులు మొదలు..!

ఇంటర్నెట్‌డెస్క్: ఎప్పుడూ చైనాపై ఏదో ఒక దర్యాప్తు మొదలుపెట్టామని అమెరికా చెప్పడం సర్వ సాధారణంగా చూస్తుంటాం. కానీ, ఈ సారి సీను రివర్స్ అయింది. వాషింగ్టన్ రెండు అంశాల్లో తప్పుడు విధానాలు అవలంభిస్తోందంటూ.. బీజింగ్ రెండు దర్యాప్తులు మొదలుపెట్టింది. అది కూడా స్పెయిన్‌లోని మాడ్రిడ్‌లో రెండు దేశాల మధ్య చర్చలు మొదలుకానున్న వేళ కావడం గమనార్హం. ఈ సమావేశంలో జాతీయ భద్రత, టిక్‌టాక్ సోషల్ మీడియా యాజమాన్య హక్కుల వంటివి చర్చకు రానున్నాయి. అమెరికా సెమీకండెక్టర్లను లక్ష్యంగా చేసుకొని చైనా ఈ దర్యాప్తులు చేపట్టింది. కొన్ని ఐసీ చిప్స్‌లో అమెరికాపై యాంటీ డంపింగ్ ఇన్వెస్టిగేషన్‌ను మొదలుపెట్టింది. వీటిని అమెరికాలోని టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఆన్ చిప్స్ సంస్థలు తయారు చేస్తుంటాయి. చైనా లో తయారైన సెమీకండెక్టర్లపై వివక్ష చూపుతోందంటూ మరో దర్యాప్తును చేపట్టింది. ఆదివారం మాడ్రిడ్‌లో చైనా వైస్‌ప్రీమియర్ లిఫెంగ్, అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ భేటీ కానున్నారు. అమెరికా ఎగుమతి నియంత్రణలు, టారిఫ్‌లు వంటి వాటిని ఈ సందర్భంగా చైనా బలంగా ప్రస్తావించే అవకాశం ఉంది. శుక్రవారం అమెరికా ప్రభుత్వం 23 సంస్థలను ఆంక్షల పరిధిలోని జాబితాలో చేర్చడంతో చైనా ప్రతీకారంగా ఈ నిర్ణయం తీసుకొంది. వీటిల్లో చైనా చిప్స్ తయారీ సంస్థ ఎస్ఎమ్ఐసీ కూడా ఉంది.



మరోవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పుడు తన గురిని చైనాపై పెట్టారు. నాటో దేశాలన్నీ రష్యా నుంచి చమురు కొనుగోలు నిలిపివేయాలని శనివారం పిలుపునిచ్చారు. దాంతోపాటు రష్యన్ పెట్రోలియం కొంటున్న చైనాపై 50 నుంచి 100 శాతం సుంకాలు విధిస్తానని కూడా సంకేతం పంపారు. భారీస్థాయిలో డ్రాగన్‌పై సుంకాలు విధిస్తేనే రష్యా–ఉక్రెయిన్ యుద్ధం నిలిచిపోతుందని తాను విశ్వసిస్తున్నట్లు ప్రకటించారు. కొన్ని నాటో దేశాలు ఇప్పటికీ రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుండటం దిగ్భ్రాంతికి గురిచేస్తోందని ట్రంప్ తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. యుద్ధాన్ని నిలువరించేందుకు కావాల్సిన నిబద్ధత కొన్ని నాటో దేశాల్లో 100 శాతం కన్నా ఎంతో తక్కువగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

## 3 వేల ఏళ్ల క్రితం ప్రపంచాన్ని నడిపించాం.. కానీ ఏ దేశాన్ని వశపరచుకోలేదు

ఇండోర్: మూడు వేల ఏళ్ల క్రితమే భారతదేశం ప్రపంచనాన్ని నడిపించిందని, కానీ ఏ ఒక్క దేశాన్ని వశపరచుకోవడం కానీ, ఇతరుల వాణిజ్యాన్ని అణగదొక్కడం కానీ చేయలేదని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సర్‌సంఘచాలక్ మోహన్ భగవత్ అన్నారు. భారత్ ఎక్కడికి వెళ్లినా ఆ దేశానికి నాగరికత, జ్ఞానం పంచిందని తెలిపారు. ప్రహ్లాద్ పటేల్ రాసిన 'నర్మద పరిక్రమ' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'మనం ప్రపంచాన్ని నడిపించాం. ఏదేశాన్ని లోబరుచుకోలేదు. ఎవరి వాణిజ్యాన్ని దెబ్బతీయలేదు. మనం ఎవరినీ కన్వర్ట్ చేయలేదు. ఎక్కడకు వెళ్లినా నాగరితక, జ్ఞానం పంచాం. పవిత్ర గ్రంథాలు చదివి జీవితాన్ని మెరుగుపరుచుకున్నాం. ప్రతి దేశానికి సొంత ఐడెంటిటీ ఉంటుంది. ప్రతీదీ అక్కడే ఉంటుంది. అయితే వారి మధ్య మంచి కమ్యూనికేషన్ అనేది ఉండాలి. ఇప్పుడు అది లేదు' అని మోహన్ భగవత్ అన్నారు. మన పూర్వీకుల దూరదృష్టి, స్వచ్ఛమైన మనోభావాల కారణంగా 3,000 ఏళ్ల క్రితం భారతదేశం ఉత్తమ దేశంగా నిలబడిందని అన్నారు. 3 వేల సంవత్సరాలు ప్రపంచంలో ఎలాంటి ఘర్షణలు లేవని, టెక్నాలజీ ప్రగతి ఎంత గొప్పగా ఉన్నా పరిస్థితి క్షీణించలేదని, మానవ జీవితం సంతోషంగా, సంస్కారవంతంగా ఉండేదని అన్నారు.

**ఎదుగుదలను చూసి భయంతోనే..**

మోహన్ భగవత్ శుక్రవారంనాడు కూడా ఇదే విషయంపై మాట్లాడుతూ, ఇండియా ఎదుగుదల చూసి ప్రపంచ దేశాలు భయపడుతున్నాయని, భారతదేశం అభివృద్ధి చెందితే మన స్థానం ఎక్కడ ఉంటుందో అని ప్రపంచ శక్తులు భయపడుతున్నాయని అన్నారు. ఆ భయంతోనే ఇండియాపై సుంకాలు విధిస్తున్నాయని విమర్శించారు.

## నా మేధస్సు.. విలువ నెలకు రూ.200 కోట్లు

**ఇంటర్నెట్‌డెస్క్:** 20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ సురక్షితం కాదంటూ ఇటీవల పెద్దఎత్తున చర్చ జరుగుతున్న సంగతి తెలిసిందే. దీని ద్వారా తాను వ్యక్తిగతంగా లబ్ధిపొందానంటూ వస్తోన్న విమర్శలపై కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ స్పందించారు. ఈ సందర్భంగా తన మేధస్సు.. విలువ నెలకు రూ.200 కోట్లని, డబ్బుకు ఎలాంటి లోటు లేదంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. శనివారం నాగ్‌పుర్‌లో అగ్రికోస్ వెల్ఫేర్ సొసైటీ నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఆలోచనలు రైతులకు ప్రయోజనం చేకూర్చేందుకు తప్ప.. జేబులు నింపుకొనేందుకు కాదన్నారు. 'నేను డబ్బు కోసం ఇలా చేస్తున్నానని మీరు అనుకుంటున్నారా?.. నిజాయతీతో ఎలా సంపాదించాలో నాకు తెలుసు. నాకూ ఓ కుటుంబం, ఇల్లు ఉంది. నేను సాధువును కాదు.. రాజకీయ నాయకుడిని. రైతుల శ్రేయస్సు కోసం మా ప్రయత్నాలు కొనసాగుతాయి' అని పేర్కొన్నారు. ఇ20 ఇంధనం పాత వాహనాల సామర్థ్యాన్ని దెబ్బతీస్తుందా..? డ్రైవింగ్‌ను దెబ్బతీస్తుందా..? అంటూ గతంలో పలు పోస్టులు నెట్టింట్లో చక్కర్లు కొట్టాయి వాటిపై ఇప్పటికే కేంద్రం క్లారిటీ ఇచ్చింది. ఆ భయాలన్నీ నిరాధారమైనవని పేర్కొంది. ఈ క్రమంలోనే ఇ20 పెట్రోల్ వాడకాన్ని సవాల్ చేస్తూ న్యాయవాది అక్షయ్ మల్హోత్రా సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే, న్యాయస్థానం దీన్ని కొట్టేసింది. ముడి చమురు దిగుమతులపై ఆధారపడటాన్ని, వాహన ఉద్గారాలను తగ్గించడం ఇంధన భద్రత, పర్యావరణ సంరక్షణ వంటి లక్ష్యాలను చేరుకోవడానికి ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని తీసుకుందని పేర్కొంది.

## అస్సాంలో భూకంపం.. 5.8 తీవ్రతతో ప్రకంపనలు

**ఇంటర్నెట్ డెస్క్:** అస్సాంలో భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై 5.8 తీవ్రతగా నమోదైంది. ఉదల్‌గిరి జిల్లాలోని ధెకియజులి ప్రాంతానికి 16 కి.మీ దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ వెల్లడించింది. 5.కి.మీ లోతులో ఇది సంభవించిందని పేర్కొంది. భూకంప తీవ్రతకు పలు ఇళ్లు స్వల్పంగా ఊగినట్టు సమాచారం. అయితే, ఇప్పటివరకు ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని అస్సాం అధికారులు వెల్లడించారు. మేఘాలయ, మణిపుర్, త్రిపుర రాష్ట్రాల ప్రజలు కూడా తమ ప్రాంతాల్లో ప్రకంపనలు వచ్చినట్లు పేర్కొన్నారు. ఈశాన్య రాష్ట్రాలతో పాటు బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్, మయన్మార్, చైనాలోనూ భూ ప్రకంపనలు వచ్చినట్లు తెలిసింది. అస్సాంలోని ఇదే ప్రాంతంలో (సోనిత్‌పుర్‌లో) వారం క్రితం 3.5 తీవ్రతతో భూకంపం సంభవించింది. ప్రధాని మోదీ ప్రస్తుతం అస్సాం పర్యటనలోనే ఉన్న విషయం తెలిసిందే. అస్సాం మాజీ సీఎం, కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ 'ఎక్స్'లో స్పందించారు. రాష్ట్రంలో భారీ భూకంపం సంభవించిందని.. ప్రతి ఒక్కరూ సురక్షితంగా ఉండాలని కోరుకుంటున్నానని, ఇదే సమయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. భూకంప తీవ్రత అధికంగా ఉందని పేర్కొంటూ సోషల్ మీడియాలో స్థానికులు పోస్టులు పెడుతున్నారు. కాంగ్రెస్ నేత భూపెన్ కుమార్ బోరా కూడా తన నివాసంలో ఓ పూలకుండీ కదిలిపోతున్న వీడియోను పోస్టు చేశారు. దీని తర్వాత ప్రకంపనలు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో రాష్ట్ర విపత్తు నిర్వహణ బృందాలు, స్థానిక అధికారులు అప్రమత్తమయ్యారు.

## అర్ధ కుంభమేళా-2027.. పుణ్య స్నానాల తేదీలివే..

**హరిద్వార్ :** అఖిల భారత అఖాడా పరిషత్ హరిద్వార్ అర్ధ కుంభమేళా– 2027కు ప్రతిపాదిత తేదీలను ఆమోదించడంతో ఈ ఉత్సవానికి కౌంట్‌డౌన్ అధికారికంగా ప్రారంభమైంది. ఉత్తరాఖండ్ ప్రభుత్వం త్వరలో అర్ధ కుంభ క్యాలెండర్‌ను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉన్నప్పటికీ, వివిధ అఖాడాలకు చెందిన సాధువులు ఈ ఉత్సవం కోసం తరచూ సమావేశమవుతున్నారు. హరిద్వార్‌లో జరిగే అర్ధ కుంభమేళా– 2027కు సంబంధించిన మూడు ప్రధాన పుణ్య స్నానాల షెడ్యూల్ ను అఖాడా పరిషత్ ఖరారు చేసింది. 2027 మార్చి 6, మార్చి 8, ఏప్రిల్ 14 తేదీలలో ఈ షాహీ స్నానాలు జరగనున్నాయని తెలిపింది. ప్రతి ఆరు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే అర్ధ్ కుంభమేళా ప్రధానంగా హరిద్వార్, ప్రయాగ్‌రాజ్ (అలహాబాద్)లలో జరుగుతుంటుంది.

## ర్యాలీలతో లండన్ ఉద్రిక్తం.. ఆందోళనకారులు, పోలీసుల మధ్య ఘర్షణలు

లండన్ నగరం శనివారం ఉద్రిక్తతలకు వేదికగా మారింది. వేలమంది నగర వీధుల్లోకి వచ్చి తమ నిరసనలను తెలియజేశారు. ఒకవైపు వలసదారులపై వ్యతిరేకతను వ్యక్తంచేస్తూ ఆందోళనలు జరుగగా.. మరోవైపు జాత్యహంకారాన్ని ఖండిస్తూ 'స్టాండప్ టు రేసిజమ్' అనే నినాదంతో మరో ర్యాలీ జరిగింది. ఈ రెండు ర్యాలీల నేపథ్యంలో శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీసులు భారీఎత్తున మోహరించారు. అయినప్పటికీ ర్యాలీలు హింసాత్మకంగా మారడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తమైంది. లండన్ వీధుల్లో వలసదారుల వ్యతిరేక ర్యాలీలో వేలమంది పాల్గొన్నారు. వలసలవల్ల తమ దేశంలో ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతున్నాయని, సామాజిక సమస్యలు పెరుగుతున్నాయని వారు ఆందోళన వ్యక్తంచేశారు. ఈ నిరసనకారులు తమ డిమాండ్లను గట్టిగా వినిపించడానికి నినాదాలు చేస్తూ ప్లకార్డులు పట్టుకుని నగరంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ తీశారు. కానీ ఈ ర్యాలీలో కొంతమంది నిరసనకారులు హద్దులు దాటడంతో హింసాత్మకంగా మారింది. పోలీసులపై వాటర్ బాటిళ్లు, రాళ్లు రువ్వారు. దాంతో పోలీసులు 26 మందిని అదుపులోకి తీసుకున్నారు. అదే సమయంలో నగరంలో మరో నిరసన ర్యాలీ కూడా జరిగింది. స్టాండ్ అప్ టు రేసిజమ్ అనే సంస్థ నాయకత్వంలో జాత్యహంకారానికి వ్యతిరేకంగా 5 వేల మంది ర్యాలీలో పాల్గొన్నారు. సమాజంలో సమానత్వం, ఐక్యతను ప్రోత్సహించాలని నిరసనకారులు కోరారు. వివిధ జాతులు, సంస్కృతుల ప్రజలు ఒకే దేశంలో సామరస్యంగా జీవించాలని పిలుపునిచ్చారు. శాంతియుతంగా తమ నిరసనను తెలియజేశారు. ప్లకార్డులు, బ్యానర్‌లు పట్టుకుని, నినాదాలు చేస్తూ, జాత్యహంకార వివక్షను ఖండిస్తూ ముందుకు నడిచారు.

# కిర్క్ హత్యలో కార్ల్ మార్క్స్ ప్రమేయం



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మానసపుత్రుడైన చార్లీ కిర్క్ దారుణ హత్యకు గురయ్యాడు. ఉథా వ్యాలీ యూనివర్సిటీలో సెప్టెంబరు 11న నిర్వహించిన 'ద అమెరికన్ కమ్‌బ్యాక్ టూర్' కార్యక్రమంలో ప్రసంగిస్తుండగా కిర్క్‌ను కాలేజీ విద్యార్థి ఒకడు తుపాకీతో కాల్చి చంపేశాడు. కిర్క్ 32 ఏళ్ల యువకుడు. అయితే ఛాందసుడు. కొంతమంది యువకులు పుట్టుకతో వృద్ధులు అనే బాపతు! అమెరికా కళాశాలల్లో అల్లరిమూకలు కాల్పులు జరిపిన వార్తలు తరచూ వింటుంటాం. ఇది అలాంటి హత్య కాదు. అమెరికన్లేగాక ఈ వార్త తెలిసిన వారంతా దీన్ని ఒకానొక హత్యా సంఘటనగా తేలిగ్గా తీసిపడేయడం లేదు. దాన్నొక భిన్న సైద్ధాంతిక శిబిరాల ఘర్షణగా చూస్తున్నారు. వివిధ దేశాలపై, వివిధ సమూహాలపై ట్రంప్ అనుసరిస్తున్న కక్షసాధింపు విధానాల మీద జరుగబోయే ప్రతిచర్యలకు ఇదొక మచ్చుతునక అంటున్నారు. ఇది ఇంతటితో ఆగదని కూడ కొందరు అంటున్నారు. చార్లీ కిర్క్ మీద కాల్పులు జరిపిన విద్యార్థిని పోలీసులు గుర్తించారు, అరెస్టు చేశారు. అతని పేరు టేలర్ రాబిన్‌సన్. 22 ఏళ్ల యువకుడు. హంతకుడ్ని చూసి ఉథా గవర్నర్ స్పెన్సర్ కాక్స్ షాక్‌కు గురయ్యాడు. రాబిన్‌సన్ కుటుంబంతో అతనికి సన్నిహిత సంబంధాలున్నాయి. మంచి కుటుంబంబీ మంచి అబ్బాయిబీ కానీ ఇంతలో ఇలా ఎలా రాడికల్‌గా మారిపోయాడు అంటూ ఆశ్చర్యపోయాడు. అమెరికాలో కూడా కమ్యూనిస్టు తీవ్రవాదుల్ని రాడికల్స్ అంటారు. చార్లీ కిర్క్ క్రైస్తవ మతవాదిబీ అతివాద జాతీయవాది. సులువుగా చెప్పుకోవాలంటే అమెరికాలో పురాతన అమెరికన్లు, సనాతన క్రైస్తవులు మాత్రమే ఉండాలని ప్రగాఢంగా నమ్మేవాడు. 2016 అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ "అమెరికాకు పూర్వ వైభవాన్ని పునరుద్ధరిద్దాం" (%మీఘనివ చాఎవతీఅఝు +తీమఫ్ చాస్త్రుఱఅ – పీూ+ూ%) అనే నినాదాన్ని ఇచ్చాడు. ఉదారవాదాన్ని తిరస్కరించడం, ప్రపంచీకరణను వ్యతిరేకించడం, అమెరికాకు వలసల్ని అడ్డుకోవడం, అన్నింటా అమెరికా ప్రయోజనాలే ముఖ్యం అనడం ఇందులో ముఖ్యమైన అంశాలు. రోనాల్డ్ రీగన్ 1980లలోనే ఇలాంటి నినాదాలు ఇచ్చాడు. అయితే, ట్రంప్ వాటికి మరింత పదునుపెట్టాడు. ట్రంప్ విధానాలను ఛార్లీ గట్టిగా అందిపుచ్చుకున్నాడు. వాటిని దేశమంతటా విస్తృతంగా ప్రచారం చేయడానికి 'టర్నింగ్ పాయింట్ యూఎస్ఏ' అనే సంస్థను నెలకొల్పాడు. 2020 నవంబరు నెలలో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రాట్ జో బైడెన్ చేతిలో ట్రంప్ ఓడిపోయాడు. అయినా ప్రెసిడెంట్ ఎలెక్ట్‌కు అధికారాన్ని అప్పచెప్పి గద్దె దిగడానికి ట్రంప్ ఒప్పుకోలేదు. 2021 జనవరి 6న వాషింగ్టన్ డీసీలో తన అనుచరులైన అల్లరిమూకలతో ఒక కపట దాడిని నిర్వహించాడు. ఆ అల్లర్లలో కిర్క్ కీలక పాత్ర పోషించి ట్రంప్‌కు మరింత దగ్గర అయ్యాడు. ట్రంప్ రెండోసారి శ్వేతభవన నివాసి కావడంతో కిర్క్ మరింత రెచ్చిపోయాడు. చార్లీకి ఉదారవాదం అస్సలు పడదు. ఒక్కసారి అందులో పడితే కొట్టుకుపోతాం అనేది అతని ప్రగాఢ నమ్మకం. ఉదారవాదం అంటే ఇతర మతాలను, ఇతర దేవుళ్ళను గౌరవించాలి. మహిళల్ని ఆదరించాలి. అతనికి గర్భస్రావం, విడాకులు కూడా నచ్చవు. ఎల్‌జీబీటీ క్యూ హక్కులు అస్సలు నచ్చవు. ఉదారవాదాలకు మూలం కార్ల్ మార్క్స్ అని అతని అక్కసు. తన ప్రత్యర్థుల్ని 'సాంస్కృతిక మార్క్సిస్టులు' అని తిట్టేవాడు. ఇదో విచిత్ర పదబంధం. మార్క్సిజం ఆర్థిక మూలాలను మాత్రమే పట్టించుకుంటుంది గానీ సాంస్కృతిక అంశాలను పట్టించుకోదని మన దేశంలో నయా అంబేద్కరిస్టులు కొందరు విమర్శిస్తుంటారు. కిర్క్ మార్క్సిజాన్ని ఒక పెద్ద ఉపద్రవంగా పరిగణించేవాడు. ఒకసారి మార్క్సిజం వలలో పడితే ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక అంశాలన్నింటిలోనూ రాజీపడాల్సి వస్తుందని అతను భావించేవాడు. ప్రపంచవ్యాప్తంగా అమెరికా బలపడాలంటే ఫాసిజం, నాజీజం వంటి సిద్ధాంతాలను పునరుద్ధరించాల్సిందే అని నమ్మేవాడు. 'సాంస్కృతిక బోల్షివిక్కు' అనే మాటను హిట్లర్ కాలపు జర్మనీలో ఒక తిట్టుగా వాడేవారు. ఇప్పుడు అమెరికాలో ట్రంప్ అనుయాయులు తమ ప్రత్యర్థుల మీద ఇదే మాటను ప్రయోగిస్తున్నారు. ట్రంప్ బలహీనపడుతున్న దశలో చార్లీ కిర్క్ చెలరేగిపోతుండడం చాలా మందికి చికాకు తెప్పించింది. ఆ మేరకు అమెరికా యువతరంలో అతని మీద ఏవగింపు కూడా పెరుగుతూ వచ్చింది. రాబిన్‌సన్ చాలాకాలంగా కిర్క్ కదలికల్ని గమనిస్తున్నట్టు విచారణలో తేలింది. కిర్క్ సనాతన భావాల్ని అతను అసహ్యించుకునేవాడట. అతన్ని 'ఫాసిస్టు' అనేవాడట. ట్రంప్ కన్నా ముందు వీడి ఆట కట్టించాలి అనే భావంతో ఉండేవాడట. కిర్క్ హత్యకు వాడిన తుపాకీతో పాటు కొన్ని బుల్లెట్లను కూడ రాబిన్‌సన్ నుంచి ఫెడరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒక బుల్లెట్ కేసింగ్ మీద 'రేయ్ ఫాసిస్ట్! అందుకో' అని రాసి ఉంది. ఇంకో కేసింగ్ మీద 'బెల్లా సియావో' అని రాసి ఉంది. ముస్సోలిని ఫాసిస్టు పాలన రోజుల్లో అతనికి వ్యతిరేకంగా బాధితులు పాడుకున్న ఇటాలియన్ పాట పల్లవి అది. అంటే ఛార్లీ కిర్క్‌ను రాబిన్‌సన్ ఎంతగా అధ్యయనం చేశాడో అతని మీద ఎంతగా కసితో రగిలిపోయాడో అర్థం అవుతోంది. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో ఇటలీలో ఫాసిజాన్నీ, జర్మనీలో నాజీజాన్నీ కార్ల్ మార్క్స్ అభిమానులు అంతం చేశారు. ఇప్పుడు అమెరికా ఫాసిస్టుల మీద కూడా సాంస్కృతిక మార్క్సిస్టులే తిరగబడుతున్నారు మరి.

# భారత్‌లోనే ఆరోగ్య సంరక్షణ బాగుంటుంది..!

భారతదేశంలో నివశిస్తున్న అమెరికన్ మహిళ క్రిస్టెన్ ఫిషర్ ఆరోగ్య సంరక్షణపై నెట్టంట షేర్ చేసిన పోస్ట్ నెటిజన్ల మనసును దోచుకోవడమే కాదు చర్చనీయాంశంగా మారింది. అంతేగాదు అక్కా మీరు చాలా బాగా చెప్పారంటూ ఆము ప్రశంసల వర్షం కురింపించారు నెటిజన్లు. అంతేగాదు అత్యంత నిజాయితీగా మాట్లాడిన తీరు కూడా చాలా బాగుందని మెచ్చుకున్నారు. ఇంతకీ ఆమె పోస్ట్‌లో ఏం రాసిందంటే.. భారతదేశంలో గత కొన్నేళ్లుగా నివశిస్తున్న క్రిస్టెన్ ఫిషర్ భారతదేశం, అమెరికాలోని ఆరోగ్య సంరక్షణ వ్యవస్థల తీరు ఎలా ఉంటుందో సోషల మీడియా వేదికగా షేర్ చేసుకుంది. ఇరు దేశాల్లోని ఆస్పత్రులు, వైద్యులు, మందులు పరంగా ఆరోగ్య సంరక్షణ ఏ దేశంలో బాగుంటుందో వెల్లడించింది. ఖర్చు, ఔషధాల పరంగా భారతదేశం బెటర్ అని, అదే యూఎస్‌లో ఈ పరంగా రోగిపై అత్యధిక భారం పడుతుందని తెలిపింది. అలాగే అపాయింట్‌మెంట్ దొరకడం కూడా కష్టం అని అన్నారు. భారత్‌లో అపాయింట్‌మెంట్‌తో పనిలేకుండానే క్లినిక్‌కి వెళ్లగలం, పైగా సమయం కూడా ఎక్కువ పట్టదని అంటోంది. అలాగే డాక్టర్లు వైద్యుడిని పర్యవేక్షించే విషయంలో కూడా భారత్ బెటర్ అని, ఎందుకంటే క్షుణ్ణంగా అతడిని విచారించి..చికిత్స అందిస్తుందని, యూఎస్‌లో రోగితో డాక్టర్ స్పెండ్ చేసే టైం చాలా తక్కువ, పైగా అంత సమయం కేటాయించేందుకు ఇష్టపడరనికూడా పేర్కొంది. ఇక ఆస్ప్రతిలో అందించే భోజనం పరంగా అమెరికా బెటర్ అని, కానీ రోగికి ఇచ్చే మెనూ ఆధారంగా వారి పర్యవేక్షకులకు అదే ఆహారం ఉంటుందని, అంత మెరుగ్గా లేదని అన్నారామె. మొత్తంగా చూస్తే ఆరోగ్య సంరక్షణ భారత్‌లోనే బాగుంటుంది, ఇక్కడ వైద్య ఖర్చు తక్కువే, పైగా మందులు కూడా సులభంగా దొరుకుతాయంటూ పోస్ట్‌లో తన అభిప్రాయాన్ని రాసుకొచ్చిందామె. ఈ పోస్ట్ నెట్టింట చర్చకు దారితీయడమే గాక, నిజాయితీగా తన అభిప్రాయాన్ని వెల్లడించిన తీరుకు నెటిజన్లు ఫిదా అయ్యారు. అదీగాక మా దేశాన్ని అభినందిస్తుందన్నందుకు అక్కా మీపై రోజురోజుకి గౌరవం పెరిగిపోతుందోందటూ పోస్టులు పెట్టారు నెటిజన్లు. కాగా, ఆమె గతంలో కూడా పలు విషయంలో భారత్‌లోనే పిల్లలు మంచిగా పెరుగుతారని, ఈ నేల నివశించడానికి అనువైనదని, ఎవ్వరినైనా తనలో కలిపేసుకునే ఆకర్షణ ఈ ప్రదేశంలో ఉందంటూ భారత్‌పై పొగడ్తల వర్షం కురిపించింది కూడా.

# వీడియో గేమ్స్ టెక్నాలజీ యువతకు వరమా?

ఒక ఎలక్ట్రానిక్ దృశ్యశ్రవణ ఉపకరణ ఇన్‌పుట్ కంట్రోలర్‌ల ద్వారా వినియోగదారులు ఆడుకునే ఆసక్తికర అత్యాధునిక క్రీడను "వీడియో గేమ్" లేదా "వీడియో గేమింగ్" అని పులుస్తున్నాం. ఒక టివీ సెట్, కంప్యూటర్ మానిటర్, హ్యాండ్‌హెల్డ్ పరికర డిస్ప్లే, టచ్ స్క్రీన్ ఉపకరణాలు లాంటి వేదికలే క్రీడా మైదానాలుగా డిజిటల్ మానవుడు ఆడుతున్న ఆధునిక ఆటను వీడియో గేమ్‌గా నేటి యువత అబ్బురపడుతూ ఆడుతున్నది. వినోదం, విరామం, కొత్త విషయాలు నేర్చుకోవడం, నైపుణ్యాలను మెరుగు పరుచుకోవడం, సామాజిక అనుభవం, పోటీల కోసం యాక్షన్, అడ్వెంచర్, రోల్-ప్లేయింగ్ గేమ్‌ల వంటి వీడియో గేమ్స్ ఆడడం జరుగుతున్నది. వీడియో గేమ్ ఆడే వ్యక్తిని 'గేమర్' అని అంటాం. 1940ల్లో వీడియో గేమ్ ఆవిష్కరణలకు పునాదులు పడుతూ 1970ల్లో వాణిజ్యపరంగా అందుబాటులో రావడం, 1980లో వీడియో గేమ్స్ సామాన్యులకు సహితం అందుబాటులోకి రావడంతో నేటి పౌర సమాజంతో విడదీయరాని సంబంధాలను సుస్థిరం చేసుకున్నది ఈ మోడ్రన్ డిజిటల్ క్రీడ. చిన్నారుల నుంచి సీనియర్ సిటిజన్ల వరకు అన్ని వర్గాలను ఆకట్టుకుంటున్న అసంఖ్యాక వీడియో గేమింగ్ ప్రక్రియలు మారుమూల ప్రాంతాలకు సహితం విస్తరించడం జరిగింది. మైన్‌క్రాఫ్ట్, సూపర్ మారియో బ్రోస్, టెట్రిస్, ఫోర్ట్‌నైట్, ది లెజెండ్ ఆఫ్ జెల్డా లాంటి పలు ప్రఖ్యాత వీడియో గేమ్స్ నేడు మార్కెట్‌ను ముంచేస్తున్నాయి. వీడియో గేమ్స్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించడం, వీటి ప్రభావాలను వివరించడం, ఆవిష్కర్తలను గుర్తు చేసుకోవడం, వినోదంతో పాటు విశ్రాంతి/విరామాలకు దోహదపడడం, ఇతరులతో ఆన్‌లైన్‌లో కనెక్ట్ కావడం, టీమ్‌వర్క్‌ను పెంపొందించడం, అభిప్రాయాలను వ్యక్తం చేయడం లాంటి అంశాలను సవివరంగా చర్చించడానికి ప్రతి ఏట 12 సెప్టెంబర్ రోజున ప్రపంచ దేశాలు "జాతీయ వీడియో గేమ్స్ దినం" పాటించుట జరుగుతున్నది. మన ముని వేళ్లతో అద్భుత ఆనందాల మైదానంలో విహరింపజేస్తున్న వీడియో గేమింగ్ రోజురోజుకు కటింగ్-ఎడ్జ్ టెక్నాలజీతో కొత్తపుంతలు తొక్కుతున్నది. వీడియో గేమింగ్ డిజిటల్ క్రీడలతో పలు ప్రయోజనాలు ఉన్నప్పటికీ కొన్ని సందర్భాల్లో నష్టాలను కూడా నమోదు చేస్తున్నాయి. వీడియో గేమింగ్ వల్ల పలు వరాల లాంటి ప్రయోజనాలు కలుగుతున్నప్పటికీ హద్దులు మీరి మునిగితే పలు అనర్థాలు లేదా శాపాలను కూడా మూటకట్టుకోవలసి ఉంటుంది. వీడియో గేమ్స్ వల్ల వేగంగా స్పందించడం, కమ్యూనికేషన్-ఇంటర్‌పర్సనల్ స్కిల్స్ పెరగడం, చిన్న చిన్న విషయాలకు సహితం స్పందించడం, నాయకత్వ లక్షణాలు/జ్ఞాపకశక్తి పెరగడం, శ్రేయస్సుకు దోహదపడడం, సామాజిక బంధాలు బలపడడం, కొత్త




భాషలు నేర్చుకోవడం, క్రిటికల్ థింకింగ్/ప్రాబ్లమ్ సాల్వింగ్ నైపుణ్యాలు పెరగడం, ఏకాగ్రత పెరగడం లాంటి పలు ప్రయోజనాలు కలుగుతాయి. రోజుకు గంటల కొద్ది వీడియో గేమ్స్ ఆడిన వారిలో శారీరక హాని, సామాజిక ఒంటరితనం, శారీరక అనారోగ్యం, మానసిక సమస్యలు, ప్రవర్తనలో మార్పులు, ఆందోళన-అనవసర ఆవేశం పెరగడం, కంటి జబ్బులు, హద్దుమీరితే దురవాటుగా మారి పిల్లలు-యువత ఉజ్వల భవిష్యత్తుకు అడ్డుపడుతుంది. డిజిటల్-ఏఐ టెక్నాలజీ వేగంగా అభివృద్ధి చెందుతున్న వేళ వీడియో గేమ్స్‌ను పరిమిత సమయం ఆడితే ఆనందంతో పాటు మానసిక ఉపశమనం కలుగుతాయి. రోజుకు 30 నిమిషాల కన్న ఎక్కువ సమయం ఆడడం మంచిది కాదు. పిల్లలు, యువత వీడియో గేమింగ్ టెక్నాలజీకి వ్యసనపరులు కాకుండా తల్లిదండ్రులు తప్పనిసరిగా పర్యవేక్షణ చేయాలి, ఏ గేమ్ ఆడుతున్నారు, ఎంత సేపు ఆడుతున్నారు అనే విషయాలను నిత్యం తెలుసుకుంటూ ఉండాలి. ఆధునిక టెక్నాలజీని మన ఆరోగ్యకర జీవనశైలిని బలపరిచే విధంగా వాడుతూ ఉండాలి. ప్రతి రోజు మైదాన క్రీడలకు లేదా వ్యాయామ క్రీడలకు, పాఠశాల హోమ్‌వర్క్ చేయడానికి ప్రాధాన్యం ఇవ్వడం కూడా మరిచి పోరాదు. ఏదైనా అతిగా వాడితే అనర్థమే అని తెలుసుకొని అన్ని రకాల ప్రక్రియలకు పరిమితసమయాలను కేటాయించుకుంటూ డిజిటల్-ఏఐ నరుడిగా ముందుకు సాగాలి. టెక్నాలజీని మానసిక-శారీరక ఆరోగ్యానికి అవసరం మేరకు వాడుకుంటూ స్మార్ట్ నరుడిగా రుజువు చేసుకోవాలి.

## ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హైదరాబాద్ శాఖకి నూతన అధ్యక్షులుగా ఎన్నికైన బూడిద నరేందర్ రెడ్డి



**సంస్థాన్ నారాయణపురం, సెప్టెంబర్ 14( ప్రభాత సూర్య ):** ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హైదరాబాద్ శాఖకి నూతన అధ్యక్షులుగా ఎన్నికైన బూడిద నరేందర్ రెడ్డి కి సర్వేల్ పూర్వ విద్యార్థుల అసోసియేషన్ సభ్యులు అభినందనలు తెలియజేశారు. సర్వేల్ పూర్వ విద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షులుగా మూడు సార్లు ఎన్నికైన బూడిద నరేందర్ రెడ్డి కి వనస్థలిపురంలో చైతన్య చిన్నపిల్లల ఆసుపత్రి కలదు. అదేవిధంగా ఎంతో మందికి ఉచిత వైద్యం అందిస్తున్నారు. ఈ సందర్భంగా బూడిద నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులును ఆయన కోరారు.

## శిల్పారామం లో అలరించిన వారాంతపూ సాంస్కృతిక కార్యక్రమాలు...




**మాదాపూర్ ప్రభుత సూర్య :** మాదాపూర్ లో నీ శిల్పారామం లో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో ఆదివారం నారాయణి నాట్యాలయ గురువర్యులు శ్రీ సంతోష్ కుమార్ తమంగ్ శిష్య బృందం చే భరతనాట్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. పుష్పాంజలి, షణ్ముఖ, కౌతం, జతిస్వరం, శబ్దం, దేవి కీర్తనం, రామ భజన, కీర్తనం, కృతి, తిల్లాన, మంగళం అంశాలను ఉర్విజ, సోమా , అవ్య, పార్వతి, యోహానా, హర్షిత రెడ్డి, రుచిత, శ్రీ చందన, భవ్య, పద్మ మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.

## డాలర్‌కు ప్రత్యామ్నాయం సాధ్యమా!

డీడాలరైజేషన్ అంటే ప్రపంచ దేశాలు అంతర్జాతీయ వాణిజ్యం, ఆర్థికం, కరెన్సీ నిల్వలలో అమెరికా డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించుకుని, బదులుగా ప్రత్యామ్నాయ కరెన్సీలను ఉపయోగించాలని లక్ష్యంగా పెట్టుకునే ప్రక్రియ. ఇది దేశీయ, అంతర్జాతీయ ఆర్థిక కార్యకలాపాలకు వర్తిస్తుంది. ప్రస్తుత ప్రపంచ పరిస్థితులలో అనేక దేశాలు వివిధ కారణాల వల్ల డీడాలరైజేషన్‌ను అనుసరిస్తున్నాయి. వాస్తవానికి, రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత బ్రెట్టన్ వుడ్స్ ఒప్పందం ద్వారా చారిత్రక, ఆర్థిక నిర్మాణాత్మక అంశాల కారణంగా అంతర్జాతీయ వాణిజ్యానికి వినిమయ మాధ్యమంగా డాలర్‌ను నిర్ణయించారు. అమెరికాఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోనే అతిపెద్దది, అత్యంత స్థిరమైనది. దాని ఆర్థిక మార్కెట్లు ముఖ్యంగా ట్రెజరీ బాండ్లు సులభంగా కరెన్సీలోకి మార్చుకోవచ్చు. అందుకే ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులచే విశ్వసించబడతాయి. చమురుతో సహా చాలా అంతర్జాతీయ వస్తువులు డాలర్లలో ధర నిర్ణయించబడి, వాణిజ్యంలో దాని వినియోగాన్ని బలోపేతం చేస్తున్నాయి. దీనికి తోడు, అమెరికా సంస్థలపై బలమైన నమ్మకం, చట్టపరమైన రక్షణలు, ప్రధానంగా డాలర్లలో పనిచేసే వాై×ఖీ(ాశీషఱవ్ఎ టశీతీ ఔశీతీశ్రీ్ఎషఱఎవ ×త్వతీఝఱఅ ఖీఱఅఱఅఎఝఱశ్రీ ్ఎవశ్రీవఱశీఎ ఎబఅఱఅఝ్ఞఅశీఅం%) వంటి వ్యవస్థల ప్రపంచ వినియోగం నుండి డాలర్ ప్రయోజనం పొందుతున్నది. ఇటీవల, అమెరికా ఆర్థిక ఆధిపత్యం అనేక దేశాల ఆర్థిక సార్వభౌమాధికారం, భౌగోళిక, రాజకీయలపై పెరుగుతున్న కారణంగా డీడాలరైజేషన్‌ను అనుసరిస్తున్నాయి. అమెరికా ఆంక్షలకు డాలర్ ఆధారిత వ్యవస్థ ఒక ప్రధాన చోదకశక్తి. అందుకే రష్యా, చైనా, ఇరాన్ వంటి దేశాలు ఆర్థిక పరిమితులను నివారించడానికి డాలర్ ప్రత్యామ్నాయాలను వెతకడానికి ప్రేరేపించింది. 2025లో, అమెరికా తన సుంకాల విధానాన్ని గణనీయంగా విస్తరించింది. ప్రపంచవ్యాప్తంగా డజన్ల కొద్దీ వాణిజ్య భాగస్వాములను లక్ష్యంగా చేసుకుంది. అందులో భారతదేశం, బ్రెజిల్ ఇప్పుడు 50% సుంకాలను ఎదుర్కొంటున్నాయి. ఈ రెండింటికి మించి, కొత్త సుంకాలను పొందుతున్న ఇతర దేశాలలో సిరియా (41%), లావోస్ (40%), మయన్మార్ (40%), తరువాత స్విట్జర్లాండ్ (39%), ఇరాక్ (35%), సెర్బియా (35%) ఉన్నాయి. బంగ్లాదేశ్, కంబోడియా, శ్రీలంక, తైవాన్, వియత్నాం వంటి ఆసియాలోని అనేక దేశాలు 19- 20% మధ్య సుంకాలను ఎదుర్కొంటున్నాయి. దక్షిణాఫ్రికా, లిబియా, బోస్నియా%ఄ% హెర్జెగోవినా దేశాలు 30%- 35% వరకు సుంకాలకు లోబడి ఉన్నాయి. ఇది అమెరికా వాణిజ్య చర్యల విస్తృత భౌగోళిక, ఆర్థిక పరిధిని ప్రతిబింబిస్తున్నది. డీడాలరైజేషన్‌కు ఇతర కారణాలు ఏమిటంటే, అనేక దేశాలు అమెరికా ఆర్థిక వ్యవస్థపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని, ద్రవ్యోల్బణం, ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేటు పెంపుదల లేదా కరెన్సీ షాక్‌ల వంటి డాలర్ సంబంధిత అస్థిరతల నుండి తమను తాము రక్షించుకోవాలని ఆలోచిస్తున్నాయి. గ్లోబల్ ఫైనాన్స్‌లో బహుళ ప్రామాణిక కరెన్సీకి కూడా ఒత్తిడి పెరుగుతున్నది. ఇక్కడ బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు స్థానిక కరెన్సీల వినియోగాన్ని లేదా చైనా క్రాస్-బోర్డర్ ఇంటర్‌బ్యాంక్ చెల్లింపు వ్యవస్థ వంటి ప్రత్యామ్నాయ వ్యవస్థలను ప్రోత్సహిస్తున్నాయి. డాలర్ నుండి వైవిధ్యభరితంగా మారడం ద్వారా, ఈ దేశాలు వాణిజ్యం, ద్రవ్యవిధానం, అంతర్జాతీయ చెల్లింపులపై ఎక్కువ నియంత్రణను పొందాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. దీనిలో భాగంగా, అనేక దేశాలు అమెరికా డాలర్‌కు బదులుగా వారి స్వంత కరెన్సీలను ఉపయోగించి వాణిజ్యాన్ని ఎక్కువగా నిర్వహిస్తున్నాయి. ముఖ్యంగా సన్నిహిత రాజకీయ, ఆర్థిక సంబంధాలు ఉన్న దేశాలలో లేదా అమెరికా ఆంక్షలను దాటవేయడానికి ప్రయత్నిస్తున్న దేశాలలో ఈ ధోరణి పెరుగుతోంది. చైనా, రష్యా డాలర్ ఆధారిత లావాదేవీలను పక్కదారి పట్టించడానికి వారి స్వంత కరెన్సీలలో (చైనీస్ యువాన్, రష్యన్ రూబుల్) వాణిజ్యాన్ని గణనీయంగా విస్తరించాయి. భారతదేశం, రష్యాలు చమురు దిగుమతులు సహా ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రూపాయలు -, రూబుల్‌లలో పరిష్కరించుకుం టున్నారు. టర్కీ, రష్యా, ఇరాన్ కూడా డాలర్ ఆంక్షలను నివారించడానికి స్థానిక కరెన్సీ వాణిజ్య ఒప్పందాలలో పాల్గొంటున్నాయి. ఇతర ద్వైపాక్షిక స్థానిక కరెన్సీ వాణిజ్య ఒప్పందాలు బ్రెజిల్, చైనా, అర్జెంటీనా కొన్ని వాణిజ్య ఒప్పందాలను బ్రెజిలియన్ రియల్ లేదా యువాన్‌లో పరిష్కరించుకుంటున్నాయి. దక్షిణాఫ్రికా, నైజీరియా వంటి కొన్ని ఆఫ్రికన్ దేశాలు ప్రాంతీయ బ్లాక్‌లలో స్థానిక కరెన్సీ వాణిజ్య ఏర్పాట్లను అన్వేషిస్తున్నాయి. సౌదీ అరేబియా, చైనా డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించడానికి యువాన్ ఆధారిత చమురు వాణిజ్యం గురించి చర్చలు జరుపుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కొన్ని వాణిజ్య కూటములు

# మోడీ కార్మిక వ్యతిరేక విధానాలపై సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలి

**గట్టుప్పల్ ప్రభాతసూర్య 14** కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్ ప్రవేశపెట్టడం ద్వారా కార్మిక వర్గాన్ని ఆధునిక బానిసలుగా మార్చే విధానాన్ని చేపట్టిన నేపథ్యంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు చినపాక లక్ష్మీనారాయణ కార్మిక వర్గానికి సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం సిఐటియు గట్టుప్పల్ మండల జనరల్ బాడీ సమావేశం అచ్చిని బీరప్ప అధ్యక్షతన విజయవంతంగా జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, మోడీ ప్రభుత్వం కార్మికుల హక్కులకు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్స్ పూర్తిగా రద్దు చేయకపోతే పోరాటం ఆగిపోనని స్పష్టం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను స్వదేశీ–విదేశీ కార్పొరేట్ కంపెనీలకు దత్తతం చేయడం ద్వారా ప్రజాస్వామ్యంపై తీవ్రమైన ముప్పు ఉందని విమర్శించారు. ప్రజల అసంతృప్తిని పక్కదారి పట్టించేందుకు విద్వేష రాజకీయాలను వృద్ధి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే కార్మిక వర్గ సమస్యలను పరిష్కరించి కనీస వేతనాలు అమలు చేయనున్నట్లు హామీ ఇచ్చినప్పటికీ, 19 నెలలు గడిచినా ఏ రంగానికి చెందిన కార్మికుల సమస్యలు పరిష్కరించలేదని తీవ్రంగా విమర్శించారు. షెడ్యూల్ పరిశ్రమల్లో కనీస




వేతనాలు తక్కువగా సవరించడం ద్వారా కోటి 20 లక్షల మందికి పైగా కార్మికులను ద్రోహం చేశారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం చట్టాల ద్వారా పెట్టుబడుదారులకు అదనపు అవకాశాలు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నప్పుడు, పరోక్షంగా ఈ రాష్ట్రంలో కూడా అదే విధానం అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పని గంటల పెంపు ద్వారా కార్మిక హక్కులను దాడి చేస్తున్నారని హెచ్చరించారు. ఇచ్చిన హామీలను ఇప్పటికీ అమలు చేయకపోతే భవిష్యత్తులో మరింత తీవ్రమైన ఉద్యమాలు తప్పవని సంకల్పపూర్వకంగా వెల్లడించారు. సమావేశంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎర్పుల యాదయ్య, జిల్లా నాయకులు వరికుప్పల ముత్యాలు, వివిధ రంగాల యూనియన్ నాయకులు కర్నాటి సుధాకర్, కక్కునూరి రాము, ఏర్పుల సైదులు, ఇడెం వేదావతి, భీమ గాని భవాని, రాణి, గంట నరసింహ, దుబ్బాక శంకరయ్య, మరియు సిఐటియు నాయకులు పెదగాని నరసింహ, రబ్బాని, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# నిద్రావస్థలో ఆర్.అండ్.బి, పంచాయతీరాజ్ శాఖలు

రోడ్లపైన గుంతలు పడి ప్రజల ప్రాణాలు పోతున్న పట్టించుకునే నాధుడే లేడు

సిపిఎం రాష్ట్ర రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి . జహంగీర్

**భువనగిరి, సెప్టెంబర్ 14( ప్రభాత సూర్య ):** జిల్లా వ్యాప్తంగా వర్షాలకు పెద్ద ఎత్తున గ్రామాలలో ప్రధాన జాతీయ రహదారులైన రోడ్ల పైన గుంతలు ఏర్పడి ప్రజల ప్రాణాలు పోతున్న పట్టించుకునే నాధుడే లేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి. జహంగీర్ ఆవేదన వెలిబుచ్చారు. నిద్రావస్థలో ఆర్.అండ్.బి, పంచాయతీరాజ్ శాఖలు ఉన్నాయని ఆరోపించారు. ఆదివారం భువనగిరి మండల పరిధిలోని అనాజిపురం గ్రామంలోని జి.ఎన్.పి పంక్షన్ హాల్లో సిపిఎం భువనగిరి మండల స్థాయి పార్టీ సభ్యుల క్లాసులు నిర్వహించగా ఈ క్లాసుల బోధించడానికి ముఖ్యఅతిథిగా జహంగీర్ పాల్గొని మాట్లాడుతు జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున వర్షాలు కురవడం వల్ల రోడ్లు మొత్తం కూడా గుంతలు ఏర్పడి గుంతలలో నీళ్లు నిలిచి దారి కనబడక అనేకమంది వాహనదారులు ప్రమాదాలకు గురై ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని అన్నారు. ఈ గుంతలను పూడ్చడంలో ఈ రెండు శాఖలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. తట్టెడు మట్టి కూడా గుంతలలో పోసే పరిస్థితి లేదని హైవే రోడ్ల వెంబడి కాజివేలు ఉండడం వల్ల వర్షాలకు రోడ్లపై నీళు పోవడంతో రాకపోకలు ఇబ్బందులు జరుగుచున్నాయని చాలామంది ప్రయాణికులు తెలియక నీళ్లు దాటడం వల్ల ప్రాణాలు కూడా కోల్పోతున్నారని ఇప్పటికైనా ప్రభుత్వము హై లెవెల్ బ్రిడ్జిని లను నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలు ఉన్న రోడ్ల విషయంలో నోరు మెదపడం లేదని, మరమ్మతులు చేపట్టడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వము తగిన నిధులు కేటాయించి ధ్వంసమైన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని లేకపోతే సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన, పోరాటాలు కొనసాగిస్తామని జహంగీర్ హెచ్చరించారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మ మాట్లాడుతూ అనాజిపురం నుంచి జంపల్లి వరకు డబల్ రోడ్డు నిర్మాణం చేయాలని, చిన్నేరు వాగు పైన మరియు నాగిరెడ్డిపల్లి నందనం హైవే పైన హై లెవెల్ బ్రిడ్జినిలను నిర్మాణం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. క్లాసుల ప్రారంభానికి ముందు పార్టీ జెండాను సిపిఎం సీనియర్ నాయకులు గునుగుంట్ల శ్రీనివాస్ ఆవిష్కరించగా ఈ క్లాసులకు సిపిఎం మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య ప్రిన్సిపల్ గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నర్సింహ, మండల




కార్యదర్శివర్గ సభ్యులు కొండ అశోక్, అన్నంపట్ల కృష్ణ , మండల కమిటీ సభ్యులు అబ్దుల్లాపురం వెంకటేష్, బొల్లెపల్లి లీలా, సిలివెరు ఎల్లయ్య, పాండాల మైసయ్య,మోటె ఎల్లయ్య, కొండపురం యాదగిరి, మద్యపురం బాల్ నర్సింహ, కళ్లెం లక్ష్మీనరసయ్య, మండల నాయకులు వడ్డబోయిన వెంకటేష్, జటా అంజిరెడ్డి, అనాజిపురం గ్రామ శాఖ కార్యదర్శులు ఏదునూరి వెంకటేశ్, కడారి కృష్ణ , సభ్యులు యండి జహంగీర్, ముచ్చపతి బాలయ్య, బీసు సతీష్, మైలారం శివ, ఆకుల బిక్షపతి, నారగోని బాలరాజు, నాగుల రాజు, బొల్లెపల్లి ప్రవీణ్,భాను, కళ్యాణి, గీత, మౌనిక, శ్రీలత, లలిత తదితరులు పాల్గొన్నారు.

# ఇంజనీరింగ్ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఎర్రవెల్లి జగన్ ఎంతో కృషి చేశారు

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో సైతం అలుపెరుగని పోరాటం చేశారు

కరోనా కష్టకాలంలో దాతల సహాయంతో ఎంతోమందికి నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు

ఎరవెల్లి జగన్ ని వరించిన శ్రీ మోక్షగుండం విశ్వేశరయ్య ఎక్సెలెన్స్ అవార్డ్ 2025


**కూకట్ పల్లి, సెప్టెంబర్ 14 (ప్రభాత సూర్య ) :** జాతీయ ఇంజనీరింగ్ దినోత్సవం సందర్భంగా, సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో సేవలు అందిస్తున్న ప్రముఖ జే ఎన్ టి యు హెచ్ విద్యార్థినేత ఎరవెల్లి జగన్ కు ప్రతిష్టాత్మక శ్రీ మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఎక్సెలెన్స్ అవార్డ్ –2025 ను ప్రధానం చేశారు. ఆదివారం ఆక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైటెక్స్ ఎగ్జిబిషన్ గ్రౌండ్ హైదరాబాద్ లో నిర్వహించిన ఇంజనీరింగ్ డే దినోత్సవ వేడుకల్లో ఎరవెల్లి జగన్ కు – భారతరత్న, మొట్ట మొదటి భారతదేశం ఇంజనీర్ – శ్రీ మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఎక్సెలెన్స్ అవార్డ్–2025 ను అందజేశారు. ఈ సందర్భంగా ఆక్ట్ ఫౌండేషన్ ఛైర్మెన్ మూర్తి మాట్లాడుతూ గత దశాబ్ద కాలంగా ఇంజనీరింగ్ విద్యార్థి నేతగా ఎరవెల్లి జగన్ డిప్లొమా స్టూడెంట్ ఫెడరేషన్, స్టూడెంట్ జేఏసీ ను స్థాపించి, డిప్లొమా, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో సైతం అలుపెరుగని పోరాటం చేశారని, కరోనా కష్ట కాలంలో దాతల సహాయంతో ఎంతోమందికి నిత్యావసర సరుకులు అందజేశారని అన్నారు. 2016– 17 సంవత్సరంలో పూణే లో జరిగిన ఇండియన్ స్టూడెంట్ పార్లమెంట్ సదస్సుకు తెలంగాణ రాష్ట్ర విద్యార్థి ప్రతినిధిగా హాజరై విద్యార్థుల సమస్యల పట్ల జాతీయ స్థాయిలో మాట్లాడినట్టు తెలిపారు. వీరి సేవలను గుర్తించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డా. బిఆర్ అంబేద్కర్ స్మారక ప్రతిభ పురస్కార్ అవార్డ్ ను అందించిందని, హెచ్ఎంటీవీ సైతం విద్యార్థి నేతగా గుర్తించి ఇచ్చిన అవార్డ్, ట్రూ టీచర్స్ కోయలేషన్ రాష్ట్ర ఉత్తమ విద్యార్థి నాయకునిగా అందించిన అవార్డులను గుర్తు చేశారు. నిరంతరం విద్యార్థి నేతగా కళాశాలల్లో, విద్యా వ్యవస్థలో నెలకొన్న సమస్యల పరిష్కారం




కోసం నిరంతరం కృషి చేస్తున్న ఎరవెల్లి జగన్ అవార్డులకే వన్నె తీసుకొస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భారతదేశం లెఫ్టినెంట్ కల్నల్ డా. కమలాకర్, మిసెస్ ఇండియా డా.శోభా, రామ్ దేవరావ్ హాస్పిటల్స్ సిఈవో డా. యోబు తదితరులు పాల్గొన్నారు.

# భాజపా బూత్ కమిటీల నియామకం

**చౌటుప్పల్.సెప్టెంబర్ 14. ప్రభాత సూర్య:** భారతీయ జనతా పార్టీ చౌటుప్పల్ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం చౌటుప్పల్ మున్సిపాలిటీ లోని తంగేడుపల్లి గ్రామానికి సంబంధించిన బూత్ కమిటీల నియామకాన్ని బిజెపి సీనియర్ నాయకుల సమక్షంలో ప్రకటించడం జరిగిందని భాజపా పట్టణ అధ్యక్షురాలు కడారి కల్పన యాదవ్ తెలిపారు. 49, 54 వ బూత్ అధ్యక్షులుగా కద్దాలా శ్రీను, సిలివేరు సురేష్, ప్రధాన కార్యదర్శులుగా వర్కాల శివ, అరిగే లింగస్వామిని ఎన్నుకున్నట్లు ప్రకటించారు.ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షురాలు కడారి కల్పన యాదవ్ మాట్లాడుతూ... బూత్ కమిటీల అధ్యక్షులు పార్టీ సూచించిన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ బూతులలోని సమస్యలను మున్సిపల్ శాఖ దృష్టికి తీసుకురావాల్సిందిగా తెలియజేశారు. అనంతరం జిల్లా మాజీ ఉపాధ్యక్షులు రమణగొని శంకరయ్య మాట్లాడుతూ... బూత్ కమిటీ అధ్యక్షులకు పార్టీ విధివిధానాలను దిశా నిర్దేశం చేసినారు.ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు ఆలే చిరంజీవి, మాజీ ఫ్లోర్ లీడర్ పోలోజు శ్రీధర్ బాబు,కడారి ఐలయ్య, తోకల సాయికుమార్, బత్తుల జనార్ధన్ గౌడ్, చికూరి ప్రభాకర్, గుండెబోయిన వేణు, తూర్పునూరి లక్ష్మణ్ గౌడ్, నేదునూరి గణేష్,బత్తుల రాజశేఖర్, జట్ట ముత్యాలు, కేతరాజు మహేష్, సిలివేరు శ్రీకాంత్, సిలివేరు బ్రహ్మం, పి .శేఖర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, ఇ. దామోదర్ రెడ్డి, బి.గణేష్ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



## శాంతి స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ క్రీడాకారులకు సన్మానం



**భువనగిరి, సెప్టెంబర్ 14( ప్రభాత సూర్య):** శాంతి స్పోర్ట్స్ అసోసియేషన్ భువనగిరి వారి ఆధ్వర్యంలో బోనగిరి పట్టణంలోని సీనియర్ క్రీడాకారులు గోనూరు శ్రీనివాస్, గజ్జి ఐలయ్య లకు సన్మాన కార్యక్రమం గోనూరు శ్రీనివాస్ యాదాద్రి భువనగిరి జిల్లా నుండి సివిల్ సర్వీస్ పోటీలలో పాల్గొని డిస్కస్ త్రో లో బంగారు పతకం సాధించడం జరిగింది. గజ్జి ఐలయ్య మోడల్ స్కూల్ లోతుకుంట వ్యాయామ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నాడు అతను వలిగొండ మండలం ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయునిగా అవార్డు తీసుకున్న సందర్భంగా ఇద్దరినీ శాంతి స్పోర్ట్స్ సభ్యులు సన్మానం చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి సీనియర్ క్రీడాకారులు బోదాసు పాండురంగం, ఎండి యూసుఫ్, అంబోజు అనిల్ కుమార్ ,మామిళ్ళ కుమార్, మాటూరి వినోద్, మాదాసు వినోద్, జెగిని నవీన్ పాల్గొనడం జరిగింది.

## మాతృదేవోభవ అనాధ ఆశ్రమం

మొగుదాల యాదయ్య గౌడ్ కుటుంబానికి సహాయం




**సంస్థాన్ నారాయణపురం, సెప్టెంబర్ 14( ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన మొగుదాల యాదయ్య గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మరణించిన విషయాన్ని తెలుసుకొని మాతృదేవోభవ అనాధ ఆశ్రమ వ్యవస్థాపకులు గట్టు గిరి తమవంతు సహాయంగా క్వింటాల్ బియ్యం, నిత్యావసర సరుకులను వారి కుటుంబసభ్యులకు అందించడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకస్మికంగా మరణించిన విషాద సంఘటన అందరినీ కలచివేసింది కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న యాదయ్య గౌడ్ మరణం చాలా బాధాకరమని అన్నారు.వారి కుటుంబానికి అన్ని విధాలుగా మా ఆశ్రమం ఎల్లవేళలా అండగా ఉంటుందని పేర్కొన్నారు.

## బీజేపీ సేవాపక్షం మండల కార్యశాల సమావేశం

–భాజపా మండల అధ్యక్షులు కైరం కొండ అశోక్




**చౌటుప్పల్.సెప్టెంబర్ 14. ప్రభాత సూర్య :** యాదాద్రి భువనగిరి జిల్లా,చౌటుప్పల పురపాలక కేంద్రంలో ఆదివారం భారతీయ జనతా పార్టీ సేవా పక్షం కార్యశాల సమావేశ ఏర్పాటును భాజపా మండల అధ్యక్షులు కైరం కొండ అశోక ఆధ్వర్యంలో నిర్వహించారు . సమావేశంలో సెప్టెంబర్ 17 భారత ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన సందర్భంగా సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు సేవాపక్షం కార్లక్రమాలు, సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవంను గ్రామ గ్రామాన నిర్వహించడం వంటి కార్యక్రమాలపై చర్చించి నట్లు మండల అధ్యక్షుడు కైరంకొండ అశోక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తాటిపాముల శివకృష్ణ గౌడ్, ఉడుగు యాదయ్య గౌడ్, దూడల బిక్షం గౌడ్, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, బత్తుల జంగయ్య గౌడ్, చినుకని మల్లేశం యాదవ్, పొత్తబతిని బాలరత్నం, పర్నే శ్రీనివాసరెడ్డి, పులిగిళ్ళ శ్రీనివాసాచారి, దిండు భాస్కర్ గౌడ్, పబ్బతి శేఖర్ గౌడ్, యాస అశోక్ రెడ్డి, అల్మాస్పేట గౌతమ్, తోకల మహేందర్ రెడ్డి, మోరే నాగేష్, బత్తుల మహేష్ , దెండే అడవయ్యా,బోరంగడ్డ నరేందర్ రెడ్డి, మెలిగే వెంకటేశం,మందుల బీరప్ప,గుర్రం రవీందర్, కంచర్ల వెంకట్ రెడ్డి,కనకా చారి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్.ఆర్ విద్యాసంస్థల ఫ్రెషర్స్ డే




**నల్గొండ సెప్టెంబర్ 14 ప్రభాత సూర్య** విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలి చెడు అలవాట్లకు బానిసలు కావద్దు నల్లగొండ డిఎస్పి కొలను శివరాం రెడ్డి ఘనంగా ఎస్.ఆర్ విద్యాసంస్థల ఫ్రెషర్స్ డే నల్లగొండ విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదివి ఉన్నత ఉద్యోగ అవకాశాలు పొందాలని నల్లగొండ డిఎస్పి కొలను శివరాంరెడ్డి సూచించారు. నల్లగొండ పట్టణంలోని ఎన్ఆర్ఎస్ గార్డెన్స్ లో ఆదివారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చదువుతో పోరాటం చేస్తేనే భవిష్యత్తు బాగుంటుందన్నారు ఇంటర్మీడియట్ దశ జీవితాలను మార్చివేస్తుందని ఆలోచనను గమనించి విద్యార్థులు కష్టపడాలని అన్నారు. ఈ దశలో వేసే అడిగు రేపు భవిష్యత్తుకు పునాది అవుతుందని సమాజానికి మార్గదర్శకంగా నిలిచే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం వివిధ విభాగాలలో ఉత్తమంగా రాణించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ వేడుకలో ఎస్ఆర్ జూనియర్ కళాశాల , పాఠశాల జోనల్ ఇంచార్జ దోనాల శ్రీనివాస్ రెడ్డి, అసిస్టెంట్ జోనల్ సతీష్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ మనోజ్ రెడ్డి, ఎస్ ఆర్ ప్రైమ్ స్కూల్ ప్రిన్సిపల్ రూప, డీన్ కిషోర్ పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర గురుకుల విద్యాలయాల సంస్థ విశ్రాంత ఉద్యోగుల రాష్ట్ర కమిటీ ఎన్నిక

–రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన కె. వెంకట నరసయ్య



**సంస్థాన్ నారాయణపురం, సెప్టెంబర్ 14( ప్రభాత సూర్య ):** తెలంగాణ రాష్ట్ర గురుకుల విద్యాలయాల సంస్థ విశ్రాంత ఉద్యోగుల సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కేశిడి వెంకట నరసయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇతను గతంలో సర్వేలు గురుకుల విద్యాలయం ప్రిన్సిపల్ గా విధులు నిర్వహించారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా పురస్కారం అందుకున్నారు. ఉపాధ్యక్షుడిగా డి. సంపత్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా కే. సుబ్బారావు, సంయుక్త కార్యదర్శిగా కె. రమాదేవి, కోశాధికారిగా వీ. తిరుపతిరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా ఎస్ వెంకటాచార్యులు, ఆర్. ఉపేందర్ రెడ్డి, గౌరవ సలహాదారులుగా కే. రవిచందర్, తీరందాసు శ్యాంసుందర్ ఎన్నికైనట్టు ప్రకటించారు.

# ఆస్తుల కోసం వేధిస్తున్నారు

-మాకు ప్రాణ రక్షణ కల్పించండి....

-చేకూరి నాగేంద్రమ్మ



**ఖమ్మం( సూర్య ప్రతినిధి)** ఆస్తుల కోసం వేధిస్తున్నారు మాకు ప్రాణ రక్షణ కల్పించాలని ఖమ్మం నగరం విడివోస్ కాలనీ వాసి చేకూరి నాగేంద్రమ్మ (భర్త సత్యం బాబు(లేట్)) వేడుకున్నారు. నిన్న ఖమ్మం కిన్నెర హోటల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ మాకు శ్రీధర్ శేఖర్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిద్దరిని మంచిగా పెంచి పెద్ద చేసి విద్యా బుద్ధులు నేర్పించి వివాహాలు చేసినాము. నా భర్త చాలా ఏండ్లు కష్టపడి తన స్వార్జితంగా పెద్ద మొత్తంలోనే స్తిరాస్తులు కూడా బెట్టాడు. చిన్న కుమారుడికి వివాహం చేసిన కొద్ది రోజులకే అతని స్వభావంలో మార్పు వచ్చింది. అతని మామ అయిన డోర్నకల్ మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన తాళ్ళూరి బాబు జోక్యం మా కుటుంబ వ్యవహారాలలో క్రమంగా ఎక్కువయ్యింది. 2014 సం. లోనే సిరాస్తి గొడవలు సృష్టించాడు. అతను చెప్పింత ఆస్తి తన కూతురు అల్లుడు పేర్లతో నా భర్త యొక్క స్వార్జిత ఆస్తిని వ్రాసి ఇవ్వాలని నానా రకాలుగా వత్తిడి తెచ్చాడు. తర్వాత వారు ముగ్గురు కలిసి మానసిక వేదింపులకు గురి చేశారు. ఖమ్మంలో పేరున్న కొందరు పెద్దలు జోక్యం చేసుకుని నాయకుడు వంటి వారు మద్యే మార్గంగా నా చిన్న కుమారుడికి రూ. 75 కోట్ల విలువైన ఆస్తిని రాసి ఇచ్చేవిధంగా ఒప్పందం చేసినారు ఇరు పక్షాలు ఒప్పుకున్నాము. కాని కొద్ది రోజులకే అందుకు విరుద్ధంగా మా చిన్న కుమారుడు అతని భార్య సుజాత అతని మామ కలిసి గొడవలు లేవదీశారు. అయినప్పటికీ మరి కొందరు పెద్దలు కూడా కలిసి రూ. 85 కోట్ల ఆస్తి ఇచ్చే విధంగా 2023 సం. లోనే ఒప్పందం చేశారు. ఇరు పక్షాలు ఓప్పుకున్నారు. మళ్ళీ దానిని కూడా కాదని నా భర్తను అవమానకరంగా తిట్టడం బెదిరించడం కొట్టడం చేశారు. ఇవన్నీ తట్టుకోలేని నా భర్త మరణ వాగ్మూలం వ్రాసి ది. 02-12-2024న వృధ్ధాప్యంలో ఆత్మహత్య చేసుకున్నాడు. నేను ఒంటరి దానను అయి పోయాను. తర్వాత నా పెద్ద మనమడి పెండ్లి సమయంలో కూడా వచ్చి ఇదే ఆస్తి తగాదా చేసి ఆటంకపరిచి బంధు చిన్న కోడలు సుజాత రైఢీల్లాగా వ్యవహరించే మరో ముగ్గురు మహిళలను పదిమంది వరకు పురుషులను తన వెంటబెట్టుకుని నా యింట్లోకి వచ్చింది. వృధ్ధురాలిని అని చూడ కుండా నా చిన్న కొడుకు తన భార్య కూడా ఏమే ఇష్టం వచ్చినట్లు బండ బూతులు తిట్టారు. ఇంట్లో అంతటా వెతికి అన్ని రకాల తాళం చెవులు తీసుకున్నారు. నన్ను ఇంట్లో నుండి బయటకు వెళ్ళమని బెదిరించారు. ఇప్పుడు కూడా వారంతా నా పెద్ద కుమారుడి ఇంట్లోనే ఉన్నారు. అతన్ని కొట్టారు. లోపలి నుండి గేట్ తాళం వేసుకున్నారు. మాకు మంత్రి అండ ఉన్నది. పోలీసులుగాని ఖమ్మంలో ఇంకెవ్వరైనా మమ్ములను ఏం చేయలేరు. ఎవరినైనా డబ్బులతోకొనేస్తాం. లేదా బెదిరిస్తాం. మాకు వంద కోట్ల ఆస్తి రాసిస్తేనే వెళ్ళిపోతాం అంటున్నారు. వీరిలో చిన్న కొడుకు కోడలు వారి బంధువులు తదితరులున్నారు. ది. 12-09-2025న. నేను పోలీసులకు ఫిర్యాదు ఇచ్చాను. అతి దగ్గర్లోనే పోలీస్ స్టేషన్ ఉన్నది. పోలీసులు అప్పుడప్పుడు వచ్చి వారిని చూసి వెళ్ళి పోతున్నారు. కాని వారిని బయటకు వెళ్ళమని చెప్పట్లేదు. ఈ నెల పదోతేదీన వచ్చిన ఈ రౌఢీ ముఠా మా పెద్ద వియ్యంకుడి మా పెద్ద కుమారుడి నా యిండ్లల్లో దూరి చేయకూడని అఘాఇత్యాలన్నీ చేస్తున్నారు. కావున తమరి అండ ఉన్నదని చెప్పుకుని వితంతు ఒంటరి వృధ్ధురాలినైన నా ఇంట్లో తిష్టవేసి నాకు సంభంధంలేని వంద కోట్ల ఆస్తి రాసివ్వమని బెదిరిస్తున్న ఈ రౌఢీ ముఠాను బయటకు పంపించి నాకు వీరి నుండి ప్రాణ హాని లేకుండా నా భర్త యొక్క దుస్థితే నాకూ రాకుండా కొంతకాలం బ్రతికేట్లు చేయగలరని మంత్రి ని కోరుతున్నాను.

# ఆపదలో ఉన్న స్నేహితురాలికి సహాయం అందించిన స్నేహితులు



**సంస్థాన్ నారాయణపురం,సెప్టెంబర్ 14( ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం జనగాం గ్రామానికి చెందిన తోటి సహచరురాలు గజ్జి సైదమ్మ కిడ్నీ సమస్య వల్ల ఇబ్బందులు ఎదురవుతున్న సందర్భంలో ఆమెకు మేము ఉన్నామని తోటి మిత్రులు కలిసి 50 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించిన మిత్రులు, మిత్రురాళ్లకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపుతూ,మనం కలిసి మెలిసి అంటూ ఇలాగే ఐక్యతతో ముందుకు వెళ్ళాలని మనసారా కోరుకుంటున్నామన్నారు. .గజ్జి సైదమ్మ కలవడానికి సమయం కేటాయించి వచ్చిన వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. 2003-2004 సంవత్సరానికి చెందిన 10వ తరగతి విద్యార్థుల అందరి సహకారంతో మొత్తం ?50,000/- సేకరించి ఆమెకు అందించడం జరిగిందనీ తెలిపారు. ఈ సహాయ కార్యక్రమంలో సహకరించిన ప్రతి ఒక్కరికి పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము అన్నారు. ఈ కార్యక్రమంలో గజవెల్లి వెంకన్న, మహ్మద్ కాలేక్, బైకని మల్లేష్ యాదవ్, అంతటి శ్రీను, కొండూరు నగేష్, టేకుమట్ల రమేష్, సైదులు, బైకని సైదమ్మ,కందుల లింగమ్మ, కొండూరు పాండు, పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర కౌన్సిల్ సభ్యునికి ఘనంగా సన్మానం

**37 సంవత్సరాలుగా పత్రికా రంగంలో పనిచేస్తున్న శ్రీనివాసులను రాష్ట్రంలో గుర్తింపు**

**బిఐక్యతగా, నిజాయితీగా ఉన్న పెబ్బేర్ ప్రెస్ క్లబ్ పాత్రికేయులకే జిల్లా, రాష్ట్ర కమిటీలో పదవులు...**

**జర్నలిస్టు ముసుగులో బ్లాక్మెయిల్ చేసే వారికి యూనియన్ లో స్థానం ఉండదు : రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్.**



**పెబ్బేరు సెప్టెంబర్ 14 ప్రభాత సూర్య** రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికైన వనపర్తి జిల్లా పెబ్బేరుకు చెందిన సీనియర్ పాత్రికేయులు ఎన్.శ్రీనివాసులును ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గొడుగు. బాలవర్ధన్ ఆధ్వర్యంలో... పెబ్బేర్, శ్రీరంగాపూర్ పాత్రికేయులందరూ ఆదివారం రోజు మున్సిపాలిటీ "గెస్ట్ హౌస్" లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా హాజరైన యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్ మాట్లాడుతూ... 37 సంవత్సరాలుగా పత్రికా రంగంలో నిర్వహింగా పనిచేస్తూ నీతికి నిజాయితీకి మారుపేరుగా నిలిచిన, శ్రీనివాసులను రాష్ట్ర నాయకులు గుర్తించి ఆయనకు రాష్ట్ర కార్యవర్గంలో సంచిత స్థానం కలిగించడం జరిగిందని ఈ సందర్భంగా ఆయనను సన్మానించడం ఎంతో గర్వంగా ఉందని అన్నారు. నేటి సమాజంలో జర్నలిస్టులు నీతికి నిజాయితీకి కట్టుబడి ఉంటేనే విలువలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. కొందరు జర్నలిస్టు ముసుగులోబ్లాక్మెయిల్ చేస్తూ వార్తలను రాస్తూ కాలం గడుపుతున్నారనిబిలి అలాంటి వారికి సంఘంలో గానీ సమాజంలో గాని గౌరవ మర్యాదలు ఉండవని అలాంటివారిని టీయూడబ్ల్యూజే -ఐజేయు సంఘం దూరంగా ఉంచుతుందని తెలియజేశారు. జర్నలిజంలో జర్నలిస్టుకు ప్రభుత్వ ఉచిత వైద్యం అందించడానికి మన యూనియన్ ఎంతో కృషి చేసిందని అన్నారు. జర్నలిస్టులకు వస్తున్నటువంటి అక్రిడేషన్ల లో కమిటీలను తొందరలోనే ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. పెబ్బేరు లోని ప్రెస్ క్లబ్ లో ఉన్న జర్నలిస్టులు విలువలతో వార్తలను రాస్తూ వారి గౌరవాలను పెంచుకుంటున్నారని అందువలన వారికి జిల్లాలో, రాష్ట్ర కమిటీలలో స్థానం కలిగే విధంగా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు బాలస్వామి ,ప్రశాంత్ వనపర్తి టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు మాధవరావు, కార్యదర్శి రాజు, కోశాధికారి మన్యం, నియోజకవర్గ అధ్యక్షులు విజయకుమార్, ప్రధాన కార్యదర్శి బాలరాజు, ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి సూర్యవంశం పరశు రాముడు, కిరణ్ కుమార్ గౌడ్, గోపాలకృష్ణ, తదితరులతో పాటు శ్రీరంగాపూర్ పాత్రికేయులు పాల్గొన్నారు.

# తెలంగాణ మీసేవ ఆపరేటర్స్ అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ గా శ్రీ చెరుపల్లి కృష్ణ గారు నియామకం జరిగింది.







రాష్ట్ర కార్యవర్గ లో తీసుకున్నందుకు రాష్ట్ర కమిటీకి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, నా సేవలు సంఘ బలోపేతానికి మీసేవ మిత్రులకు దోహదపడేల ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మీసేవ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బత్తుల జీవన్ ప్రసాద్ గారు, ప్రధాన కార్యదర్శి కొత్త కిరణ్ కుమార్ గారు, వర్కింగ్ ప్రెసిడెన్స్ అశ్విన్ గౌడ్ గారు, జగదీష్ గారు, లచ్చన్నా గారు, ఉపాధ్యక్షులు పనస చంద్రశేఖర్ గారు, శివకుమార్ గారు, కోశాధికారి గొట్టిపర్తి శ్రీకాంత్ గారు, రాష్ట్రంలో నుంచి కార్యక్రమానికి వచ్చిన జిల్లా అధ్యక్షులు ,కార్యదర్శులు మరియు మీసేవ ఆపరేటర్స్ లు పాల్గొన్నారు.

## కుమ్మరిసంఘం గ్రామ అధ్యక్షులుగా పోలేపల్లి వెంకటేష్ నియామకం



**చౌటుప్పల్.సెప్టెంబర్ 14. ప్రభాత సూర్య** :చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రం లింగోజిగూడెం గ్రామంలో కుమ్మరి సంఘం నూతన కమిటీని ఆదివారం కుమ్మరి సంఘం మండల కన్వీనర్ సిలువేరు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. లింగోజిగూడెం గ్రామ కుమ్మరి సంఘం నూతన అధ్యక్షులుగా పోలేపల్లి వెంకటేష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సిలివేరు శ్రీనివాస్ ప్రకటించారు. మండల కన్వీనర్ సిలివేరు శ్రీనివాస్,కో-కన్వీనర్ తాదూరి వెంకటేష్, మండల కార్యవర్గ సభ్యులు తీగుళ్ల నరసింహ,చిలువేరు నరేష్, పోలేపల్లి ముత్యాలు సమక్షంలో గ్రామ నూతన అధ్యక్షులుగా ఎన్నికైన పోలేపల్లి వెంకటేష్ మాట్లాడుతూ...గ్రామ కుమ్మరి సంఘం అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తన ఎంపికకు సహకరించిన అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా గ్రామ ప్రధాన కార్యదర్శిగా పోలేపల్లి లింగస్వామి, ఉపాధ్యక్షులు పోలేపల్లి భాస్కర్ కార్యదర్శి పోలేపల్లి ముత్తయ్య, సలహాదారులు పోలేపల్లి నరసింహ,కోశాధికారి పోలేపల్లి జంగయ్య , కార్యవర్గ సభ్యులు పోలేపల్లి శివకుమార్, ముత్తయ్య,శివశంకర్, యాదయ్య,యాదయ్య, యాదయ్య తదితరులు కమిటీ లో ఉన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సాయి,రాములు, రంగయ్య,పెద్ద ముత్తయ్య, నరసింహ,యాదయ్య, భాస్కర్,వెంకటేశం,నరేష్, మహేష్,ప్రవీణ్,లచ్చయ్య, అంజయ్య,నవీన్, జంగయ్య, శివశంకర్, ఉషయ్య, శేఖర్, యాదయ్య, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు సీతామాధవి



**మర్రిగూడ సెప్టెంబర్ 14(ప్రభాత సూర్య)** మర్రిగూడ ఆదర్శ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న కొండూరు గ్రామానికి చెందిన విద్యార్థిని సీతామాధవి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. సూర్యాపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన 35వ సబ్ జూనియర్ బాలికల టోర్నమెంట్ నిర్వహించామన్నారు. 25 నుండి 28 వరకు నిజామాబాద్ జిల్లా ముప్కల్ లో జరిగే టోర్నమెంట్ కు సీతామాధవి ప్రిపేర్ అవుతున్నట్లు ఆయన తెలిపారు. బాలికలు చదువుతోపాటు క్రీడారంగంలో రాణించి మంచి విజయాలు సొంతం చేసుకోవాలని నిరూపించారు సీతా మాధవి. రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో విజయం సాధించాలని మనం ఆల్ ది బెస్ట్ చెబుదాం. ఆమె ఎంపిక పట్ల తల్లిదండ్రులు జంగయ్య పార్వతమ్మ, ఉపాధ్యాయులు గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

## విద్యార్థులు కష్టపడితే ఉజ్వల భవిష్యత్తు

ఎం ఎస్ ఓ రమేష్



**నల్లగొండ సెప్టెంబర్ 14 ప్రభాత సూర్య** విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్ ఎస్ ఓ రమేష్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర కళాశాల వసతి గృహం లో షెడ్యూలు కులములు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి అవసరాలు ఉన్న హాస్టల్ వార్డెన్ సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున,లెక్చరర్ లు వేణుగోపాల్,లి గయ్య , హాస్టల్ సంక్షేమ అధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.

## ఘనంగా చల్లా నర్సింహరెడ్డి జన్మదిన వేడుకలు..



**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :** కాంగ్రెస్ పార్టీ ఇన్ఛార్జ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వి.జగదీశ్వర్ గౌడ్ తో కలిసి , మియాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు యలమంచి ఉదయ్ కిరణ్, వారి టీం సభ్యులు రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ చల్లా నర్సింహరెడ్డి జన్మదిన వేడుకలలో బాగంగా కర్మన్ ఘాట్ లో, శేరిలింగంపల్లి నియోజకవర్గం లోని డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీ ఎత్తున నిర్వహించిన జన్మ దిన వేడుకలలో పాల్గొన్నారు. ఈ సందర్భంలో యలమంచి ఉదయ్ కిరణ్ జన్మదినశు భాకాంక్షలు తెలియజేసి, శాలువాతో సత్కరించారు. ఈ వేడుకలో నియోజకవర్గ నాయకులు, పార్టీ కార్యకర్తలు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ ప్రతినిధులు తదితరులు ఘనంగా పాల్గొని వారికి జన్మ దిన శుభాకాంక్షలు తెలిపారు.

## రాష్ట్ర గురుకుల విశ్రాంత ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడిగా కె.వెంకట నరసయ్య

-ఉపాధ్యక్షుడిగా డి సంపత్ కుమార్



**చౌటుప్పల్. సెప్టెంబర్ 14. ప్రభాత సూర్య :** తెలంగాణ రాష్ట్ర గురుకుల విద్యాలయాల సంస్థ విశ్రాంత ఉద్యోగుల సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. తెలంగాణ రాష్ట్ర గురుకుల విద్యాలయాల సంస్థ విశ్రాంత ఉద్యోగుల రాష్ట్ర కమిటీ అధ్యక్షుడిగా కేశిడి వెంకట నరసయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కే వెంకట నరసయ్య గతంలో చౌటుప్పల్ సర్వేల్ గురుకుల విద్యాలయాల్లో ప్రిన్సిపల్ గా విధులు నిర్వహించారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా పురస్కారం అందుకున్నారు. తెలంగాణ రాష్ట్ర గురుకుల విద్యాలయాల సంస్థ విశ్రాంత ఉద్యోగుల రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడిగా డి. సంపత్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా కే. సుబ్బారావు, సంయుక్త కార్యదర్శిగా కె. రమాదేవి, కోశాధికారిగా వీ. తిరుపతిరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా ఎస్ వెంకటాచార్యులు, ఆర్. ఉపేందర్ రెడ్డి, గౌరవ సలహాదారులుగా కే. రవిచందర్, తీరందాసు శ్యాంసుందర్ ఎన్నికైనట్టు తెలియజేశారు.

# వామ్మో.. ప్రైవేట్ దవాఖానలు! డెంగీ పేరు చెప్పి హడలెత్తిస్తున్న వైద్యులు

జ్వర పీడితులకు చుక్కలు

అవసరం లేకున్నా అడ్డగోలు టెస్టులు

విచ్చల విడిగా హాస్పిటళ్ల దోపిడీ

ఎక్కడా కనిపించని ధరల సూచికలు

పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం



**కరీంనగర్ :** కరీంనగర్‌లోని ప్రైవేట్ దవాఖానల్లో ఎక్కడ చూసినా ఇప్పుడు జ్వర పీడితులే కనిపిస్తున్నారు. ప్రభుత్వ అధికారుల లెక్కల ప్రకారం ప్రతి రోజూ 2 వేల నుంచి 2,500 మంది జ్వరాలతో బాధపడుతూ వివిధ దవాఖానల్లో చేరుతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ దవాఖానలకు వెళ్లే జ్వర పీడితుల సంఖ్య 200 నుంచి 250 వరకే ఉంటోంది. మిగతా వాళ్లంతా ప్రైవేట్‌ను నమ్ముకొని వెళ్తే జేబులు ఖాళీ అవుతున్నాయి. జ్వరంతో బాధపడుతూ ఏ ప్రైవేట్ దవాఖానకు వెళ్లినా రూ.వేలల్లో ఖర్చు చేయాల్సి వస్తోందని రోగులు వాపోతున్నారు. నిజానికి జ్వరంతో బాధపడే రోగులకు మూడు రోజుల తర్వాత టెస్టు చేస్తే గానీ అది ఏ జ్వరమో బయటికి రాదు. అది కూడా సీబీపీ (కంప్లీట్ బ్లడ్ పిక్చర్) వంటి సాధారణ టెస్టు చేస్తే సరిపోతుంది. దీంతో పలు రకాల కంప్లేంట్స్ బయటపడే అవకాశాలుంటాయి. కానీ, కరీంనగర్‌లో జ్వరంతో బాధపడుతూ వచ్చిన ప్రతి ఒక్కరికీ చాలా మంది ప్రైవేట్ వైద్యులు రకరకాల టెస్టులు చేయిస్తున్నట్లు తెలుస్తోంది. టైఫాయిడ్, మలేరియా టెస్టులే కాకుండా లివర్ ఫంక్షన్ పేరిట ఎల్ఎఫ్‌టీ, కిడ్నీ ఫంక్షన్ పేరిట ఆర్ఎఫ్‌టీ వంటి వైద్య పరీక్షలు అదనంగా చేయిస్తున్నారు. ఇందులో ఏమీ తేలకుంటే చివరికి విటమిన్ పరీక్షలు కూడా చేయిస్తున్నారు. మామూలు జ్వరంతో వస్తే ఇన్ని టెస్టులేమిట్రా దేవుడా? అని రోగులు లబోదిబోమంటున్నారు. వైద్యులందరూ కూడబలుక్కున్నట్లు రోగులు ఏ ప్రైవేట్ దవాఖానకు వెళ్లినా ఇవే అనుభవాలు ఎదురవుతున్నాయి.

**ఐసీయూ.. ఇదో రకం దోపిడీ**

జ్వరం హై టెంపరేచర్‌లో ఉండి దవాఖానలో చేరితే చాలు.. ఐసీయూలోకి మార్చేస్తున్నారు. జ్వర పీడితులకు అక్కడ చేసే ప్రత్యేక చికిత్సంటూ ఏమీ ఉండదు. జ్వరం తగ్గడానికి యాంటీబయాటిక్, బలం కోసం ఫ్లూయిడ్స్, విటమిన్ మెడిసిన్ ఇస్తారు. దీనికి ప్రైవేటు దవాఖానల్లో డాక్టర్, నర్సింగ్, క్లీనింగ్ చార్జీలు వేసి రోజుకు రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నారు. కొన్ని కార్పొరేట్ దవాఖానల్లో అయితే ఇంతకంటే ఎక్కువే వసూలు చేస్తున్నారు. రోజుకు రూ.50 వేలు వసూలు చేసే దవాఖానలు కూడా కరీంనగర్‌లో ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. ఎన్ని ఎక్కువ రోజులుంటే అంత వస్తాయని భావించే కొన్ని ప్రైవేట్ దవాఖానలు జ్వర పీడితులను పీల్చి పిప్పి చేస్తున్నాయి. మరోవైపు వైద్యులకు కమీషన్లు ఇచ్చే డయాగ్నోస్టిక్ సెంటర్లు నిత్యం కిటకిటలాడుతున్నాయి.

**కనిపించని ధరల బోర్డులు**

ప్రైవేట్ దవాఖానల్లో అందించే సేవలకు దేనికి ఎంత చార్జి చేస్తారనేది సూచిస్తూ ధరల పట్టికలు ప్రదర్శించాలని ప్రభుత్వ పరంగా ఆదేశాలున్నాయి. కానీ, అనేక దవాఖానల్లో ఈ బోర్డులు ఎక్కడా కనిపించడం లేదు. గతంలో ఇలాంటి ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం చొరవ తీసుకుని ప్రతి ప్రైవేట్ దవాఖానలో ధర బోర్డులు ప్రదర్శించేలా చర్యలు తీసుకున్నారు. కానీ, ఇప్పుడు పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు నిత్యం తనిఖీలు నిర్వహిస్తే తప్ప ఈ దోపిడీకి అడ్డుకట్ట పడే పరిస్థితి కనిపించడం లేదు.

**రక్త కణాలు తగ్గితే డెంగీనట**

జ్వరం వచ్చినపుడు సహజంగా తెల్ల రక్త కణాలు తగ్గుతుంటాయి. జ్వరం తగ్గిన తర్వాత మళ్లీ పెరుగుతాయి. కానీ, కొందరు వైద్యులు డెంగీ లక్షణాలున్నాయని జ్వర పీడితులను బయపెడుతున్నట్లు తెలుస్తోంది. నిజానికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎంత పెద్ద ప్రైవేట్ దవాఖాన అయినా డెంగీ నిర్ధారించడానికి లేదు. కానీ, కరీంనగర్‌లోని కొన్ని ప్రైవేట్ దవాఖానలు మాత్రం ర్యాపిడ్ టెస్టులు నిర్వహించి డెంగీ లక్షణాలున్నట్లు జ్వర పీడితులను భయపెడుతున్నట్లు తెలుస్తోంది. కొందరు మాత్రం నిబంధనల ప్రకారం ర్యాపిడ్ టెస్టులో డెంగీ లక్షణాలు ఉంటే ఆ రక్త నమూనాలను ప్రభుత్వ దవాఖానకు పంపిస్తున్నారు. ప్రభుత్వ వైద్యులు డెంగీ జిల్లాలో అంత విస్తృతం కాలేదని చెబుతుంటే, ప్రైవేట్ వైద్యులు మాత్రం రక్త కణాలు తగ్గితే చాలు డెంగీ పేరు చెప్పి జ్వర పీడితులను భయానికి గురి చేస్తున్నట్లు తెలుస్తోంది.

జ్వరంతో బాధ పడే ప్రతి ఒక్కరికీ ఒళ్లు నొప్పులు ఉండడం సహజం. ఇంత మాత్రానికే కొందరు చికెన్ గున్యా టెస్టులు కూడా చేయిస్తున్నట్లు తెలుస్తోంది. జ్వరంతో బాధపడే వారిలో కొందరికి కడుపు నొప్పి కూడా ఉంటుంది. దీనికి అల్ట్రాసౌండ్ స్కానింగ్‌లు తప్పని సరిగా చేయిస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా ఒక రోగికి ఎన్ని టెస్టులు చేయించాలో అన్ని చేయించుకుంటే గానీ కొందరు వైద్యులు మందులు రాయడం లేదు. ఈ టెస్టులన్నీ చేయాలంటే ఎంత లేదన్నా రూ.6 వేల నుంచి రూ.8 వేల వరకు అవుతుందని జ్వర పీడితులు వాపోతున్నారు. తీరా అన్నీ నార్మలే ఉన్నాయని, సాధారణ జ్వరానికి రూ.2 వేల వరకు మందులు రాస్తున్న తీరు ఆశ్చర్యానికి గురి చేస్తోంది.

# మున్సిపాలిటీల్లో ఇళ్ల లబ్ధిదారులకు ముప్పుతిప్పలు



**ఇల్లెందు :** భద్రాద్రి జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో బేస్‌మెంట్ల నిర్మాణాలు చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మొదటి విడత రూ.లక్ష బిల్లు ఇంకా మంజూరు కాలేదు. దీంతో లబ్ధిదారులందరూ ముప్పుతిప్పలు పడుతున్నారు. నిర్మాణాలు పూర్తిచేసి 50 రోజులవుతున్నా మొదటి విడత బిల్లులు జమ కాకపోవడంతో తదుపరి నిర్మాణాలు ముందుకు సాగడం లేదు. దీంతో అప్పటికే ఉన్న పాత ఇళ్లను కూల్చివేసి కొత్తగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులు.. ఆ పక్కనే గుడారాలు వేసుకొని నివసిస్తున్నారు. ఇటీవలి వర్షాలకు వారు ఆ గుడారాల్లో అష్టకష్టాలు పడుతున్నారు. మొదటి విడత బిల్లులు వస్తే తదుపరి నిర్మాణాలను వేగిరం చేసి త్వరగా గృహప్రవేశాలు చేసుకోవచ్చనుకున్న లబ్ధిదారులకు ఆదిలోనే హంసపాదు ఎదురవుతోంది. ప్రభుత్వం పెట్టిన షరతులు, హౌసింగ్ అధికారులు చెబుతున్న కారణాలు లబ్ధిదారులకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. 'అన్ని తిప్పలు పెట్టేకంటే అసలు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వకపోయినా మంచిదేమో' అనుకుంటూ అరిగోస పడుతున్నారు. పేదల సొంతింటి కలను తామే నిజం చేస్తామంటూ గొప్పలకు పోయిన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని తెచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. నిబంధనల పేరుతోనూ, బిల్లుల జాప్యంతోనూ లబ్ధిదారులకు చుక్కలు చూపిస్తోంది. ముఖ్యంగా మున్సిపాలిటీల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారుల గోస అంతా ఇంతా కాదు. భద్రాద్రి జిల్లాలో కొత్తగూడెం (పాల్వంచతో కలిపి మున్సిపల్ కార్పొరేషన్), ఇల్లెందు, మణుగూరు, అశ్వారావుపేట మున్సిపాలిటీలున్నాయి. వీటిల్లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారుల్లో 241 మంది బేస్‌మెంట్ లెవెల్ వరకూ నిర్మాణాలు పూర్తిచేశారు. అయితే, ప్రభుత్వ నిబంధనల ప్రకారం బేస్‌మెంట్ నిర్మాణం పూర్తయిన (యాప్‌లో ఫొటోను అప్‌లోడ్ చేశాక) వారం రోజుల్లోనే (అంటే ప్రతీ సోమవారం) ప్రతి లబ్ధిదారుడికీ మొదటి విడత కింద రూ.లక్ష బిల్లు అతడి బ్యాంకు ఖాతాలో జమ కావాల్సి ఉంది. కానీ మున్సిపాలిటీల్లోని లబ్ధిదారులు బేస్‌మెంట్ లెవెల్ నిర్మాణాలు పూర్తిచేసి 50 రోజులవుతున్నా మొదటి విడత బిల్లులు మాత్రం ఇంత వరకూ మంజూరు కావడం లేదు.

**మున్సిపాలిటీల డేటా ఆన్‌లైన్‌లో లేదట..**

పట్టణాల్లో బేస్‌మెంట్ లెవెల్ నిర్మాణాలు పూర్తయినప్పటికీ మొదటి విడత రూ.లక్ష బిల్లు రాకపోవడంతో తదుపరి నిర్మాణాలు నిలిచిపోయాయి. అయితే, తాము బేస్‌మెంట్ నిర్మాణాలు పూర్తిచేశామంటూ 50 రోజులుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా.. వారు అనేక కారణాలు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మున్సిపాలిటీల్లోని ఇందిరమ్మ ఇళ్ల డేటా ఆన్‌లైన్‌లో కన్పించడం లేదంటూ ఏఈలు చెబుతున్నారు. తన పైఅధికారిని కనుక్కుందామంటే డీఈ సుబ్రహ్మణ్యం జూలై 31న రిటైర్మెంట్ అయ్యారు. దీంతో ఈ సమస్యను ఏఈలంతా కలిసి హౌసింగ్ పీడీ దృష్టికి తీసుకెళ్లారు. అక్కడా ఆ సమస్యకు పరిష్కారం లభించలేదు. దీంతో లబ్ధిదారులంతా కలిసి తమ సమస్యను కలెక్టర్ దృష్టికి, రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అక్కడ కూడా ఫలితం లేకపోవడంతో లబ్ధిదారులు దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు.

**గడ్డ కడుతున్న సిమెంట్.. తుప్పు పడుతున్న ఐరన్..**

50 రోజులైనా బిల్లులు రాకపోవడం, తదుపరి నిర్మాణాలు ముందుకు సాగే అవకాశం లేకపోవడం వంటి కారణాలు.. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మరికొన్ని తిప్పలు తెచ్చిపెడుతున్నాయి. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం తెచ్చిన సిమెంట్ బస్తాలు.. ఇటీవలి వర్షాలకు, తేమకు గడ్డ కడుతున్నాయి. ఆరు బయట ఉంచిన ఐరన్ కూడా వర్షాలకు తడిచి తుప్పు పడుతోంది. దీంతో తుప్పు పట్టిన ఇనుము పటిష్టతను కోల్పోవడం, గడ్డ కట్టిన సిమెంట్ పనికి రాకపోవడం వంటి కారణాలతో పేదలైన లబ్ధిదారులు ఆర్థికంగా కూడా నష్టపోవాల్సి వస్తోంది. ఇప్పటికే అప్పులు తెచ్చుకొని బేస్‌మెంట్లు నిర్మించుకున్న నిరుపేదలకు.. బిల్లుల చెల్లింపులో ప్రభుత్వం చేస్తున్న ఆలస్యం మరిన్ని ఇబ్బందులను, మరింత నష్టాన్ని తెచ్చిపెడుతుండడం గమనార్హం.

**బిల్లులు వస్తేనే కదా ఇంటి నిర్మాణం పూర్తయ్యేది?**

నాకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం ప్రారంభించి బేస్‌మెంట్ లెవెల్ పూర్తిచేశాను. ఆ వెంటనే మొదటి విడత బిల్లు జమ చేస్తే తదుపరి నిర్మాణ పనులు ప్రారంభించేదాన్ని. కానీ 45 రోజులవుతున్నా ఇంత వరకూ నాకు మొదటి విడత రూ.లక్ష బిల్లు మంజూరు కాలేదు. రోజూ ఎదురుచూస్తున్నాను. మా వద్ద ఉన్న డబ్బులతో బేస్‌మెంట్ నిర్మించాము. ప్రభుత్వం ఈ బిల్లు ఇస్తేనే కదా ఆపైన పనులు మొదలు పెట్టేది? ఏదీ లేకపోవడంతో తెచ్చిన సిమెంట్‌ను, ఐరన్‌ను కాపాడుకోలేకపోతున్నాము.

# రైతులకు యూరియా అందజేయాలని బీఆర్ఎస్ రాస్తారోకో



**ఇచ్చోడ :** రాష్ట్రంలో రైతులకు సరిపడా యూరియా అందజేయాలని ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రంలో రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు రాస్తారొకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం, రేవంత్ రెడ్డి రైతులకు యూరియా ఇవ్వకుండా మోసం చేస్తున్నాడని ఆరోపించారు. రైతులకు సరిపడ యూరియా అందక రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నారని అన్నారు. ఎన్ని ఎకరాలు ఉన్న పట్టాకు రెండే యూరియా బస్థాలు ఇస్తున్నారని, యూరియాతో పాటు బలవంతంగా నానో యూరియా బాటిల్ ఇస్తున్నారని ఆరోపించారు. నానో యూరియా బాటిల్ తీసుకుంటేనే యూరియా ఇస్తామని అధికారులు రైతులను సతాయిస్తున్నారని పేర్కొన్నారు. ఎటువంటి షరతులు లేకుండా రైతులకు సరిపడ యూరియా అందజేయాలని డిమాండ్ చేశారు. రైతులకు మద్దతుగా కేసీఆర్ కేటీఆర్ , ఎమ్మెల్యే అనిల్ జాధవ్ నాయకత్వంలో ఇచ్చోడా మండల కేంద్రం రాస్తారొకో చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు కృష్ణ రెడ్డి, ఎంపీటీసీ గాడ్గే సుభాష్, సర్పంచ్ పాండురంగ్, నర్వాడే రమేష్, మహుమూద్, గణేష్, ప్రవీణ్ , బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు .

## పెన్‌గంగ భవన్‌కు కలెక్టరేట్?



**కై లాస్‌నగర్:** నిజాం హయాంలో నిర్మించి సుమారు ఏడున్నర దశాబ్దాల పాటు జిల్లా పాలనకు వేదికై న కలెక్టరేట్ భవనం ఇక చరిత్రకు సాక్ష్యంగా నిలిచిపోనున్నట్లు తెలుస్తోంది. శిథిలావస్థకు చేరిన ఈ భవనంలోని ఏ సెక్షన్ బ్లాక్ బాల్కనీ గురువారం కుప్పకూలిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అధికారులతో పాటు ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. భవనాన్ని ఆర్అండ్‌బీ శాఖ సీఈ రాజేశ్వర్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. కార్యాలయ ముందరి భాగం పటిష్టంగానే ఉన్నట్లుగా భావించినా జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో తరలించడమే ఉత్తమమని కలెక్టర్‌కు నివేదిక ఇచ్చినట్లుగా తెలుస్తోంది. ఇంజినీరింగ్ అధికారుల బృందం సైతం ఇదే అభిప్రాయం వ్యక్తం చేసిన నేపథ్యంలో జిల్లా పాలనాధికారి కూడా తరలింపే ఉత్తమమని భావిస్తున్నట్లు సమాచారం. ఉన్నతాధికారుల ఆదేశాలతో కలెక్టరేట్‌లోని ఆయా విభాగాల అధికారులు నిర్వహణకు అనువైన భవనాలను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. శనివారం కొన్నింటిని పరిశీలించి ఫైనల్ కూడా చేశారు. అయితే కలెక్టరేట్ తరలింపుపై మాత్రం రేపటి వరకు స్పష్టత వచ్చే అవకాశమున్నట్లు తెలుస్తోంది. జిల్లా పాలనకు కేంద్రబిందువైన కలెక్టరేట్‌ను తాత్కాలికంగా పక్కనే ఉన్న ఇరిగేషన్ శాఖకు సంబంధించిన పెన్‌గంగ భవన్‌కు మార్చాలని భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. అధునాతన వసతులతో కూడిన ఈ భవనం ఇటీవలే నిర్మించారు. కలెక్టర్, అదనపు కలెక్టర్ చాంబర్లతో పాటు అన్ని సెక్షన్ల నిర్వహణకు అనుకూలంగా ఉండనున్నట్లుగా భావిస్తున్నారు. పైగా ప్రస్తుత కలెక్టరేట్‌కు ఆనుకునే ఉండటంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు సైతం అందుబాటులో ఉండనుంది. కలెక్టర్ నిర్ణయం మేరకు కార్యాలయ తరలింపు సోమవారం వరకు స్పష్టతవచ్చే అవకాశముంది.

**కలెక్టరేట్ మార్గాల మళ్లింపు..**

కలెక్టరేట్‌లో కూలిన శిథిలాల తొలగింపు పూర్తి కానందున ప్రజల భద్రత దృష్ట్యా ప్రవేశ, బయటికి వెళ్లే మార్గాలను మార్చినట్లు కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. అధికారిక కార్యక్రమాల కోసం సీపీవో, డీసీవో కార్యాలయం, కలెక్టర్ సమావేశ మందిరం, ఎస్‌బీఐ వైపు నుంచి ట్రెజరీ కార్యాలయానికి ప్రవేశం ఉంటుందని పేర్కొన్నారు. వెనుక వైపు నుంచి ఉన్న ర్యాంపు ద్వారా డీపీఆర్వో కార్యాలయం, ఆధార్ కేంద్రానికి అనుమతించనున్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజలు పోర్టికో/మెయిన్ డోర్ ద్వారా కలెక్టరేట్ కాంప్లెక్స్‌లోకి ప్రవేశించవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సహకరించాలని కలెక్టర్ కోరారు.

## ఉమ్మడి జిల్లాలో గణనీయంగా పెరిగిన సాగు విస్తీర్ణం



**మహబూబ్‌నగర్ :** పదేళ్ల క్రితం ఎటు చూసినా ఎండిన పంటలు.. బీళ్లుగా మారిన భూములు. ఫలితంగా ఉపాధి కోసం కుటుంబాలతో సహా తట్ట, బుట్ట, పార పట్టుకుని ముంబై, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు బస్సుల్లో కిక్కిరిసి వెళ్తున్న హృదయ విదారక దృశ్యాలు ఇప్పటికీ కళ్ల ముందు కదలాడుతుంటాయి. అలా వలసలకు కేరాఫ్‌గా నిలిచిన పాలమూరు జిల్లా హరితవనంగా మారింది. సాగునీరు లేక నెర్రెలు బారిన వ్యవసాయ భూముల్లో సిరుల పంట పండుతోంది. ఏటేటా సాగు గణనీయంగా పెరుగుతుండగా.. భూమికి పచ్చని రంగు వేసినట్లు కొత్త శోభను సంతరించుకుంది.

ఉమ్మడి పాలమూరు జిల్లాలో వానాకాలం సాగుకు సంబంధించి మొత్తంగా అన్ని పంటలు కలిపి 18 లక్షల ఎకరాలకు పైగా సాగయ్యాయి. మూడేళ్లుగా కొంత అటు ఇటుగా స్వల్పంగా లెక్కలు మారుతూ వస్తున్నాయి. 2023లో 18,24,268 ఎకరాలు కాగా.. 2024లో 18,11,953 ఎకరాల్లో పంటలు సాగైనట్లు అధికారిక రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది సాగు స్వల్పంగా పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం 18,07,052 ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేశారు. అదును దాటే సమయానికి అంటే వారం రోజుల్లో ఉమ్మడి జిల్లాలో మరో 50 వేల ఎకరాల్లో వరి నాట్లు పడే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో రైతులు ప్రధానంగా వరి, పత్తి, మొక్కజొన్న సాగుచేస్తున్నారు. ఏటేటా వీటి సాగు గణనీయంగా పెరుగుతూ వస్తోంది. వరి 2023 ఖరీఫ్ సీజన్‌లో 7,76,311 ఎకరాలు, గతేడాదిలో 8,09,784 ఎకరాల్లో సాగు కాగా.. ఈ సంవత్సరంలో ఇప్పటివరకు 7,90,515 ఎకరాల్లో సాగైంది. మరో 50 వేల ఎకరాల్లో వరి సాగు కానుండగా.. 8.40 లక్షల ఎకరాలకు చేరుకోనుంది. ఉమ్మడి పాలమూరులో 2023లో 6,67,824 ఎకరాల్లో, 2024లో 6,04,004 ఎకరాల్లో పత్తి సాగు కాగా.. ఈ ఏడాది 7,05,739 ఎకరాల్లో రైతులు తెల్లబంగారం పంట వేశారు. గతేడాదితో పోలిస్తే 1,01,735 ఎకరాల్లో పత్తి సాగు పెరిగినట్లు తెలుస్తోంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 2023 వానాకాలంలో 1,00,816 ఎకరాల్లో, 2024లో 85,476 ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేశారు. ఈ ఏడాది ఇదే సీజన్‌లో 1,09,708 ఎకరాల్లో మొక్కజొన్న సాగైంది. గతేడాదితో పోలిస్తే 24,232 ఎకరాల్లో మొక్కజొన్న సాగు పెరిగినట్లు స్పష్టమవుతోంది. గతేడాదితో పోలిస్తే నాగర్‌కర్నూల్ జిల్లాలో 28,634 ఎకరాల్లో పంటల సాగు పెరిగింది. మహబూబ్‌నగర్ జిల్లాలో 2,693 ఎకరాల్లో, నారాయణపేట జిల్లాలో 10,256 ఎకరాల్లో అధికంగా పంటలు సాగయ్యాయి. అదే వనపర్తిలో 28,216 ఎకరాల్లో, జోగుళాంబ గద్వాల జిల్లాలో 18,268 ఎకరాల్లో పంటల సాగు తగ్గినట్లు రికార్డులు చెబుతున్నాయి. గతేడాదితో పోలిస్తే మహబూబ్‌నగర్ జిల్లాలో పత్తి సాగు స్వల్పంగా తగ్గింది. నాగర్‌కర్నూల్ జిల్లాలో 40 వేలకు పైగా, గద్వాల జిల్లాలో 50 వేలకు పైగా ఎకరాల్లో అధికంగా రైతులు సాగు చేశారు. మొక్కజొన్నకు సంబంధించి మహబూబ్‌నగర్ జిల్లాలో గతేడాది కంటే 14 వేల ఎకరాల్లో, నాగర్‌కర్నూల్ జిల్లాలో 10 వేల ఎకరాల్లో అధికంగా సాగైంది.

## దాడి కేసులో ఐదుగురు యువకుల అరెస్ట్

**తాండూర్ :** తాండూర్ ఐబీలో పది రోజుల క్రితం జరిగిన తోపులాటలో ఓ వ్యక్తిపై దాడి చేసిన యువకులను అదుపులోకి తీసుకున్నట్లు తాండూర్ ఎస్సై డీ కిరణ్ కుమార్ తెలిపారు. తాళ్లపల్లి సృజన్ గౌడ్ అనే యువకుడు ఈ నెల 5వ తేదీన రాత్రి తాండూర్ ఐబీ చౌరాస్తాలో కొందరు వ్యక్తులు తనపై దాడి చేసి గాయపరిచారని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టామన్నారు.ఈ కేసులో సుభద్రా కాలనీకి చెందిన అనిల్, సాయి, రాజు, నరేష్, హరిని అరెస్ట్ చేశామని, నిఖిల్ పరారీలో ఉన్నాడని తెలిపారు. వీరిపై రౌడీ షీట్లు తెరువనున్నట్లు వెల్లడించారు.



# చిరంజీవితో ‘మిరాయ్’ దర్శకుడు సినిమా

తేజ సజ్జా, మంచు మనోజ్, శ్రియ కీలక పాత్రల్లో నటించిన ఫాంటసీ అడ్వెంచర్ మూవీ మిరాయ్... దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని ఈ చిత్రంతో పాన్ ఇండియా రేంజ్‌లో గుర్తింపు పొందాడు. సుమారు పదేళ్లుగా సినీ రంగంలో ఉన్న ఆయన మిరాయ్‌తో భారీ హిట్ అందుకున్నారు. అయితే, తాజాగా మెగాస్టార్ చిరంజీవితో కార్తీక్ సినిమా ఛాన్స్ దక్కించుకున్నాడు. కానీ, దర్శకుడిగా కాదు. వాల్తేరు వీరయ్య విజయం తర్వాత చిరంజీవి, దర్శకుడు బాబీ కాంబినేషన్‌లో మరో సినిమా రానున్న విషయం తెలిసిందే. ఈ సినిమాని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించే అవకాశముంది. త్వరలోనే సెట్స్ మీదకు ఈ ప్రాజెక్ట్ వెళ్లనుంది. ఈ మూవీకి సినిమాటోగ్రాఫర్‌గా కార్తిక్ ఘట్టమనేని చేయబోతున్నారు. మెగాస్టార్‌తో తొలిసారి ఆయనకు ఛాన్స్ రావడంతో ఆయన సంతోషంగా ఉన్నట్లు తెలుస్తోంది. నిన్ను కోరి, ఎక్స్‌ప్రెస్ రాజా,ధమాకా, కార్తీకేయ, చిత్రలహరి వంటి సినిమాలకు ఆయన సినిమాటోగ్రాఫర్‌గా పనిచేశారు. తాజాగా విడుదలైన మిరాయ్ మూవీ సినిమాటోగ్రాఫర్ కూడా కార్తిక్ కావడం విశేషం. సినిమాటోగ్రాఫర్‌గా కార్తీక్‌కు మంచి గుర్తింపు ఉంది. దర్శకుడిగా పనిచేస్తూనే ఆయన తన కెమెరాకు కూడా పని చెప్తారు. డైరెక్టర్‌గా తొలిచిత్రం సూర్య వర్సెస్ సూర్య తర్వాత మిరాయ్‌తో భారీ హిట్ అందుకున్నారు.



# బాక్సాఫీస్‌ను షేక్ చేస్తున్న బెల్లంకొండ ‘కిష్కిందపురి’

టాలీవుడ్‌లో యువ హీరోగా తనకంటూ ఒక ప్రత్యే కతను చాటుకుంటున్న బెల్లంకొండ శ్రీనివాస్‌కు తాజాగా విడుదలైన ‘కిష్కిందపురి’ చిత్రం అద్భుతమైన విజయాన్ని అందించింది. వివిధ జానర్‌లలో సినిమాలు చేస్తూ వెళ్తున్న బెల్లంకొండ శ్రీనివాస్.. గతంలో ‘జయ జానకి నాయక’తో యాక్షన్ ఎంటర్టైనర్‌గా, ‘రాక్షసుడు’తో సస్పెన్స్ థ్రిల్లర్‌గా ప్రేక్షకులను మెప్పించారు. ఇప్పుడు ‘కిష్కిందపురి’తో హారర్ జానర్‌లో అదరగొట్టారు. సెప్టెంబర్ 12న విడుదలైన ‘కిష్కిందపురి’ చిత్రం మొదటి రోజు నుంచే సూపర్ హిట్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. ఈ సినిమా విడుదలైన కేవలం రెండు రోజుల్లోనే బ్రేక్ ఈవెన్ మార్కును దాటేసి టాలీవుడ్‌లో ఒక సంచలనంగా నిలిచింది. పక్కా హారర్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ సినిమాకు మౌత్ టాక్ బాగా కలిసొచ్చింది. మొదటి రోజు 50 వేల టికెట్లు అమ్ముడవగా.. రెండో రోజు ఏకంగా 75 వేల టికెట్లు అమ్ముడ య్యాయి. ఇటీవలి కాలంలో టాలీవుడ్‌లో హారర్ సినిమాలు ప్రేక్షకులను పెద్దగా మెప్పించలేక పోతున్నాయి. అలాంటి సమయంలో ‘కిష్కిందపురి’ మంచి కథ, కథనంతో ప్రేక్షకులకు కొత్త అనుభూ తిని ఇచ్చిందని చెప్పవచ్చు. సినిమా కథనంలో అనవసరమైన హంగులు లేకుండా అనుకున్న పాయింట్‌ను స్పష్టంగా తెరపై చూపించడంలో చిత్ర బృందం సక్సెస్ అయింది.

# ప్రముఖ దర్శకుడికి డాక్టరేట్ ప్రదానం

ప్రముఖ చిత్ర దర్శకుడు వెట్రిమారన్ గౌరవ డాక్టరేటు పొందారు. చెన్నైలోని ప్రముఖ యూనివర్సిటీ వేల్స్ ఇన్‌స్టిట్యూట్ తరపున ప్రదానం చేశారు. చెన్నైలోని పల్లవరంలో ఉన్న వేల్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ 15వ స్నాతకోత్సవం విశ్వవిద్యాలయ ప్రాంగణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. సినీ పరిశ్రమలో అద్భుత విజయం సాధించిన శ్రీ గోకులం గ్రూప్ వ్యవస్థాపకుడు ఛైర్మన్ ఎ.ఎం. గోపాలన్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనేక చిత్రాలకు దర్శకత్వం వహించి జాతీయ అవార్డులు గెలుచుకున్న దర్శకుడు వెట్రి మారన్‌కు గౌరవ డాక్టరేట్‌లను వారు ప్రదానం చేశారు. వడచెన్నై, అసురన్, విడుదలై, ఆడుకాలమ్,కాక్క ముట్టై వంటి అవార్డ్ విన్నింగ్ చిత్రాలకు ఆయన దర్శకత్వం వహించారు. అనంతరం క్రికెట్‌లో అద్భుతంగా రాణించిన క్రికెటర్ అశ్విన్‌కు కూడా గౌరవ డాక్టరేట్ అందించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 4,992 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వేల్స్ ఎడ్యుకేషన్ గ్రూప్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రీతా గణేశ్, రిజిస్ట్రారర్ డాక్టర్.పి.శరవణన్, వైస్ ఛాన్సలర్ డాక్టర్.ఎం.భాస్కరన్, అసోసియేట్ ఛాన్సలర్ డాక్టర్.ఎ.జ్యోతి మురుగల్, ప్రొఫెసర్లు, యూనివర్సిటీ సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. గతంలొ ఇదే యూనివర్సిటీ నుంచి మెగా హీరో రామ్ చరణ్ కూడా గౌరవ డాక్టరేట్ పొందారు.



# సినిమాలు వదిలేసి జ్యోతిష్కురాలిగా మారిన హీరోయిన్.. 700 కోట్ల కంపెనీకి యజమాని..

సినీరంగంలో నటీనటుల అభిప్రాయాలు భిన్నంగా ఉంటాయి. ఇండస్ట్రీలో స్టార్ డమ్ ఉన్న చాలా మంది హీరోయిన్లు వేరే రంగాన్ని సైతం ఎంచుకుంటున్నారు. నటన నుండి కొత్త రంగాన్ని ఎంచుకున్న అలాంటి నటి ఒకరు ఉన్నారు. ఒకప్పుడు టాప్ హీరోయిన్. ఇప్పుడు మాత్రం జ్యోతిష్యం చెబుతుంది. బాలీవుడ్, టాలీవుడ్ ఇండస్ట్రీలలో స్టార్ హీరోలతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకుంది. అప్పట్లో ఆమె అందం, నటనకు ఫాలోయింగ్ ఎక్కువగా ఉండేది. ఇప్పుడు మనం మాట్లాడుకుంటున్న హీరోయిన్ పేరు తులిప్ జోషి. యష్ రాజ్ ఫిల్మ్స్ చిత్రం ‘మేరే యార్ కి షాదీ’ ద్వారా నటి తులిప్ సినీరంగంలోకి అడుగుపెట్టింది. మొదటి సినిమాతోనే అందరి దృష్టిని ఆకర్షించింది. ఆమె అభిమానుల మనస్సులలో ఆమెకు భిన్నమైన ఇమేజ్‌ను సృష్టించింది. ఆమె రాత్రికి రాత్రే స్టార్ అయ్యింది. కానీ కొన్ని సినిమాలు చేసిన తర్వాత, ఆమె బాలీవుడ్‌ను విడిచిపెట్టి నటనకు దూరంగా ఉంది. తులిప్ జోషికి స్కూల్ రోజుల నుంచే మోడలింగ్ ఆఫర్లు రావడం ప్రారంభించాయి. కానీ ఆమె గ్రాడ్యుయేషన్ తర్వాతే సినిమా రంగంలోకి అడుగుపెట్టింది. తులిప్ జోషి మొదటి సినిమా ‘మేరే యార్ కి షాదీ హై’. 2014లో, ఆమె సల్మాన్ ఖాన్ నటించిన ‘జై హొ’ చిత్రంలో కనిపించింది. ఆ తర్వాత ఆమె సినిమాలకు దూరమయ్యింది. ప్రస్తుతం సినిమాలు వదిలేసి తులిప్ ఎంచుకున్న రంగం జ్యోతిష్యం. ఇప్పుడు ఆమె జ్యోతిష్కురాలిగా మారింది. అంతే కాదు, ఆమె తన భర్త కంపెనీని కూడా నిర్వహిస్తోంది. తులిప్ జోషి భారత సైన్యంలో కెప్టెన్‌గా ఉన్న వినోద్ నాయర్‌ను వివాహం చేసుకుంది. వినోద్ భారత సైన్యంలోని పంజాబ్ రెజిమెంట్‌లోని 19వ బెటాలియన్‌లో %జూ%గా ఉన్నారు. 1995 వరకు భారత సైన్యంలో పనిచేసిన తర్వాత వినోద్ నాయర్ సైన్యం నుండి రిటైర్ అయ్యి బిజినెస్ రంగంలో రాణిస్తున్నారు. ప్రస్తుతం అతడు కిమ్మాయ అనే కన్సల్టింగ్ కంపెనీని రన్ చేస్తున్నారు. ఇప్పుడు ఆ కంపెనీ విలువ రూ.700 కోట్లు.

# మృణాల్ ఠాకూర్ బ్యూటీ సీక్రెట్ ఇదే..! సోషల్ మీడియాలో రివీల్ చేసిన హీరోయిన్..!

‘సీతారామం’తో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన నటి మృణాల్ ఠాకూర్. అభినయంతో పాటు సహజ సౌందర్యంతో ఎంతో మంది అభిమానులను సంపాదించుకున్నది. చాలామంది బయటకు వచ్చిన సందర్భాల్లో మేకప్ లుక్‌లో కనిపిస్తుంటారు. కానీ, వారికి భిన్నంగా మృణాల్ మాత్రం నేచురల్‌గానే కనిపిస్తుంది. ఈ బ్యూటీ చర్మం ఎప్పుడూ కాంతివంతంగానే మెరుస్తూ ఉంటుంది. అయితే, తన బ్యూటీ సీక్రెట్‌ను సోషల్ మీడియా వేదికగా అభిమానులతో షేర్ చేసుకుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియోను షేర్ చేసింది. ఈ వీడియోలో మృణాల్ తాను రాత్రి పడుకునే ముందు ముఖానికి ఓ ఆయిల్‌ను అప్లయ్ చేసుకుంటానని చెప్పింది. ఆ ఆయిల్ వాడటాన్ని తన తల్లి సలహాతోనే ప్రారంభించానని చెప్పింది. అదే విషయాన్ని తల్లిని అడిగి మరింత వివరించాలన కోరింది. ఇంతకీ ఆ నూనే ఖరీదైన దేమీ కాదు. అందరూ వినియోగించే బాదం నూనే అని చెప్పింది. తన తల్లి సూచించిన ఈ చిట్కా తన చర్మానికి విశేషమైన కాంతిని ఇస్తుందని మృణాల్ చెప్పుకొచ్చింది. బాదం నూనెలో విటమిన్-ఈ, ఒమేగా ఫ్యాటీ యాసిడ్లు, ప్రొటీన్లు, ఇతర ఖనిజాలు సమృద్ధిగా ఉంటాయి. ఇది సహజ మాయిశ్చరైజర్‌లా పని చేస్తుంది. అంతేకాక, యాంటీ-ఏజింగ్ లక్షణాలు ఉండటం వల్ల చర్మం యువకంగా కనిపించడానికి తోడ్పడుతుంది. వయస్సు ప్రభావాలు తొందరగా కనిపించకుండా అడ్డుకుంటుంది. ఇక కళ్ల కింద కనిపించే నలుపు వలయాలు, చర్మం ఉబ్బినట్లు కనిపించే సమస్యలకు కూడా బాదం నూనె సమర్థంగా పని చేస్తుంది. ఆ భాగంలో మృదువుగా మసాజ్ చేయడం వల్ల మంచి ఫలితాలు కనిపిస్తాయని సౌందర్య నిపుణులు సూచిస్తున్నారు. ఇదిలా ఉండగా.. మృణాల్ ఖరీదైన కొనుగోలు చేయడం ఏమాత్రం నచ్చదట. ఖరీదైన బట్టలు కొనుగోలు చేసినా వాటితో ఎలాంటి ఉపయోగం లేకుండా దాచి ఉంచాల్సి వస్తుందని అభిప్రాయపడింది. ఇప్పటి వరకు తాను కొనుగోలు చేసిన ఖరీదైన డ్రెస్ రూ.2వేలు మాత్రమేనని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పింది. స్టార్ హీరోయిన్ అయినా తక్కువ ధరల్లోనే డ్రెస్‌లు కొనుగోలు చేస్తానని చెప్పడంతో అందరూ షాక్ అవుతున్నారు. మృణాల్ ఠాకూర్ మూవీ ఈవెంట్స్, ఇతర ఫంక్షన్లకు హాజరైన సందర్భంలోనే ఖరీదైన వస్త్రాలను ధరిస్తుండగా.. వాటిని రెంట్ తీసుకొని ధరిస్తుందట. భారీ ధర దుస్తులను కొనుగోలు చేయడం నచ్చదని.. బదులుగా ఆ డబ్బులను ఫుడ్, ప్రాపర్టీస్ కొనుగోలు చేసేందుకు ఖర్చు చేస్తానని చెప్పడం విశేషం. మృణాల్ వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. మృణాల్ మరాఠీ కుటుంబంలో పుట్టి పెరిగింది. 2012 ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. కెరియర్ ప్రారంభంలో టీవీల్లో నటించింది. ఆ తర్వాత బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. తెలుగులోకి ‘సీతారామం’తో పరిచయమైంది. ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద భారీ హిట్ సాధించడంతో ఒక్కసారిగా ఈ బ్యూటీ పేరు మారుమోగింది. అయితే, అవకాశాలు మాత్రం ఎక్కువగా రాలేదు. టాలీవుడ్‌లో మృణాల్ ఠాకూర్ నాని సరసన హాయ్ నాన్న, విజయ్ దేవరకొండ సరసన ఫ్యామిలీ స్టర్ సినిమాల్లో నటించింది. ప్రభాస్ కల్కి 2898 ఏడీ చిత్రంలో చిన్న పాత్రలో మెరిసింది.





Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.